

srinannagaru.com

# దైవ సంపద

డా॥ కె. రామారావు

srinannagaru.com

దైవ సంపద

10వ ముద్రణ : ఏప్రియల్, 2005

స్పాన్సర్డ్ బై :

**సంధ్య**

హైదరాబాదు

వెల : రు॥ 10-00

srimammagaru.com

# ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీ అందరికీ మా హృదయ పూర్వక నమస్సులు. పూజ్యులెందరో గీతామాతకు వ్యాఖ్యానాలు వ్రాశారు. మాన్యులైన మీరందరూ అవి చదివే ఉంటారు. పాలు త్రాగిన నోటికి నీళ్ళు రుచించకపోవచ్చును. అయినప్పటికీ మా సత్సంగము తరపున శ్రీ నాన్నగారి 55వ పుట్టినరోజు వేడుక సందర్భములో మేము అందించిన ఈ చిరు కానుకను మీరు ఆప్యాయతతో ఆదరించి, ఆస్వాదించి, అమృత మూర్తులు కావాలని మా ఆకాంక్ష!

మీ శ్రేయస్సే - మా శ్రేయస్సు! మీ సుఖమే - మా సుఖం! మీ ఆనందమే - మా ఆనందం! మీ అభివృద్ధే - మా అభివృద్ధి!

నిజమైన సుఖము, శాంతి, కాంతి ఒక్క ఆత్మలోనే వుంది. ఆ ఆత్మ చేతికి అందేవరకు ఏ జీవుడికీ సుఖము లేదు - శాంతి లేదు - కాంతి లేదు. ఆ సుఖం కోసం, ఆ శాంతి కోసం, ఆ కాంతి కోసం ప్రయాణం చేస్తున్న మీకు - మా ఈ చిన్న పుస్తకము కొంత వరకైనా సహకరిస్తే అదే మాకు పరమానందం!

ఈ సాధనలు, తపస్సులు, పూజలు, పుణ్యాలు,

srinannagaru.com

పుస్తకాలు మనల్ని మనసు సంస్కరించుకొని, మనసు పవిత్రులు కావటం కోసమే! పవిత్రత లేనివాడు - ఆ పరమ శాంతిని పొందలేడు. అమృతత్వాన్ని ఆస్వాదించలేడు. మోక్ష సింహాసనాన్ని అధిరోహించలేడు. ఆత్మ సామ్రాజ్యానికి అధిపతి కాలేడు.

మీరెవరో మీరు తెలుసుకోనకుండా ఈ సృష్టికి సంబంధించినవి ఎన్ని తెలుసుకున్నప్పటికీ - మీకు ఏమీ తెలియనట్లే! మీరు మోక్షాన్ని సంపాదించకుండా ఎన్ని సంపదలు సంపాదించినప్పటికీ - మీరు ఏమీ సంపాదించ నట్లే! అవన్నీ ఒకటి లేని సున్నలు! మీరు జీవించి ఉండ గానే మీరెవరో మీకు ఇప్పుడు తెలియనప్పుడు - మరణా నంతరము తెలుసుకునే అవకాశము లేదు. కనుక మీ విలువైన ఈ జన్మలు సున్నలు కాకూడదని - అవి సుఖాంతము కావాలని శ్రీ రమణ దేవుని ప్రార్థిస్తూ ఈ పుస్తకమును మీ ముందు ఉంచుతున్నాము.

మీ సోదరుడు

**రామారావు**

srimammagaru.com

# కూచిమంచి వారి అభిప్రాయము

ముముక్షు కుటుంబానికి పూజనీయులైన శ్రీ నాన్నగార్కి నేటి ఆధ్యాత్మిక తత్వవేత్తలలో ఒక విశిష్ట స్థానం ఉన్నదని నిస్సంశయంగా చెప్పవచ్చు.

జటిలమైన ఆధ్యాత్మిక విషయాలను అరటి పండు ఒలిచి చేతిలో పెట్టిన చందంగా విడమరచి చెప్పే మహత్తర విద్య శ్రీ నాన్నగారి సొత్తు. ఆధ్యాత్మిక తత్వవేత్తల గురించి చెప్పాలంటే ఎవరి విశిష్టత వారి కున్నది. తత్వోపదేశ విధానంలోనే తేడాలు. శ్రీ నాన్న గారికి తనదైన ఒక ప్రత్యేక ఒరవడి ఉన్నది. పామరజన హృదయాల్ని తట్టే రీతిగా ఉండటం శ్రీనాన్నగారి ఒరవడిలోని విశేషం.

భగవాన్ శ్రీ రమణ మహర్షులవారి ఆధ్యాత్మిక తత్వాన్ని పూర్తిగా అవగాహన చేసుకొన్న బహుకొద్ది మందిలో శ్రీ నాన్నగారు ఒకరు. శ్రీ నాన్నగారు బోధిస్తున్న ఆత్మ విద్యను ఈ తరంవారికి మాత్రమే గాక భావితరాల వారికి కూడా పుస్తక రూపంలో పొందు

srinannagaru.com

పరచుట చాలా ఆనందదాయకం.

శ్రీ నాన్నగారి ప్రతీ మాట భావగర్భితమైన ఒక ఆధ్యాత్మిక నినాదం. ముముక్షువులకు దివ్యసోపానం. సుదీర్ఘ భాష్యాలు, వ్యాసాల రూపంలోకంటే ప్రజల హృదయాలకు హత్తుకొనే సూక్తుల రూపంలో ప్రవచించటం శ్రీ నాన్నగారి ప్రత్యేకత. సాహిత్య పుష్టి కలిగి ఉండటం శ్రీ నాన్నగారి సూక్తులలో విశేషం. నిజానికి ఇంతకుముందు వెలువరించిన "అమృత వాక్కులు" జిజ్ఞాసువులను మాత్రమేగాక సాహిత్యాభి మానులను సైతం మిక్కిలి ఆకర్షించాయి.

ఇప్పుడు ప్రచురిస్తున్న ఈ "దైవ సంపద" అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి మోక్షమార్గం చూపే దివ్యజ్యోతిగా వెలుగొందగలదని, శ్రీ నాన్నగారికి శాశ్వతమైన యశస్సు చేకూర్చగలదని నా దృఢ విశ్వాసం.

**కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం**

(ఆంధ్రప్రభ మాజీ సంపాదకులు)

srinannagaru.com

# ముందుమాట

వాసుదేవ స్వామి స్వయముంగా భగవంతుడు కాబట్టే ఆయన అర్జునుడికి బోధించిన గీతా శాస్త్రమును "భగవద్గీత" అని అన్నారు.

భగవద్గీత ఎంత ప్రాచీనమైనదో అంత నవీన మైనది కూడ. గీతను లోతుగా అధ్యయనము చేసిన యెడల ఇంద్రియములకు, మనస్సునకు ఏకాగ్రత కుదురుతుంది. ఏకాగ్రతతో సాధించలేనిది ఏమున్నది? పక్షి ఆకాశములో విహరించడానికి రెండు రెక్కలూ ఎంత ముఖ్యమో - అదే విధముగా మానవుడు నైతిక ముగా, సాంఘికముగా, ఆధ్యాత్మికముగా వికసించు టకు "ఏకాగ్రత, పవిత్రత" అంత అత్యంత ముఖ్యము. విశ్వశ్రేయస్సే గీతామాత యొక్క లక్ష్యము. గీతోపదేశ ము చేసిననాటికంటే - వ్యాపార సంస్కృతికి అలవడిన నేటి ప్రపంచమునకు గీతా సందేశము యొక్క ఆవశ్య కత ఎక్కువగా యున్నది. మనస్సు జీవితమును బాగు చేయనూ గలదు - మరియు నాశనము చేయనూ గలదు. అట్టి మనస్సును తీర్చిదిద్దుకొనుటకు గీతతో సమానమైన గ్రంథము లేనేలేదు. అజ్ఞానము నుండి

srimamagaru.com

విముక్తి చేసే గ్రంథరాజము శ్రీ మద్భగవద్గీత.

"స్నానానికి గంగ, పానానికి తుంగ, జ్ఞానానికి గీత" అని పెద్దలు చెపుతారు. గీతామాత జ్ఞానమాత! ఉన్నది జ్ఞానమే! అహంకారమును ఉరితీస్తే జ్ఞానము తెలియబడుతుంది. అహంకారమునకు రూపము కావాలి - కాని ఆత్మకు రూపముతో పనిలేదు. ఆత్మను అహంకారమనుకున్నా, ఆత్మను దేహానికి పరిమితము చేసుకున్నా, పనిలో అహంకారము ప్రవేశించినా చివరకు మిగిలేది దుఃఖము మాత్రమే. అహంకారమే జీవుడు! జీవుడితో యముడికి పని వుంది. ఆత్మే జ్ఞానము! జ్ఞానితో యముడికి పనిలేదు. జన్మించుట, పెరుగుట, నశించుట - ఈ భూమి మీద జరుగుతున్న నాటకము. దీనినే సంసారమని అంటారు. ఈ సంసారము నుంచి బయటపడి అమృతస్థితిని అందుకొనుటకు గీత ఎన్నో ఉపాయములను మానవజాతికి బోధించినది. గీతవంటి సమన్వయ గ్రంథము మరొకటి ఉన్నదని ఎవ్వరైనా చెబితే మీరు నమ్మకండి. హిందూమతమునకు కాశీ రాజధాని వంటిది. అదే విధముగా హిందూమత గ్రంథములకు గీత రాజు లాంటిది. స్వయముగా భగవంతుని ముఖములో నుంచి వచ్చినది. సత్యాన్వేషకుడికి గీత అండగా నిలబడుతుంది.

srinannagaru.com

వాసుదేవ స్వామి పరమాత్మ - అర్జునుడు జీవాత్మ! జీవలక్షణములున్న మనమందరమూ కూడా జీవులమే! కనుక అర్జునుడికి చెప్పిన ప్రతీమాట మనం దరికీ కూడా వర్తిస్తుంది. గీత ఉపదేశ గ్రంథము. జీవ లక్షణములు ఉన్నంతకాలము - మాయ మనల్ని ఎప్పుడు మ్రింగివేస్తుందో, అజ్ఞానము ఏ రూపమున మనల్ని కాటువేస్తుందో చెప్పలేము. ఈ మాయ నుంచి మనము బయట పడాలంటే - ఈ శరీరంలో ప్రాణము ఉన్నంతకాలమూ ఈశ్వరుణ్ణి విడిచి పెట్టకూడదు. శాస్త్రాన్ని విడిచి పెట్టకూడదు. గురువును విడిచి పెట్ట కూడదు. వినయాన్ని విడిచిపెట్టకూడదు.

ఈ గీతా శాస్త్రాన్ని గనుక మీరు చదివితే - ప్రపంచములోనున్న గ్రంథముల నన్నింటిని మీరు చదివినట్లే! వాసుదేవస్వామికి గనుక మీరు ఒక నమస్కార ము పెడితే - దేవతలందరికీ మీరు నమస్కారము పెట్టి నట్లే! గంగానదిలో గనుక మీరు స్నానము చేస్తే - సమస్త నదులలోనూ మీరు స్నానము చేసినట్లే! "మేము అవతార పురుషులము" అని ఎంతమంది చెప్పకుంటున్నప్పటికీ వాసుదేవస్వామిలాగ దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసినటువంటి అవతారము కలియుగము లో ఇంతవరకూ రాలేదు.

srimmagaru.com

సర్వసాధారణముగా ప్రాణం పోయేముందు చెప్పేమాట చాలా విలువైనదిగా ఉంటుంది. ప్రస్తుతము హర్యానా రాష్ట్రములో నున్న కురుక్షేత్రములో సుమారు ఐదు వేల సంవత్సరములకు పూర్వము మహాభారత యుద్ధము జరుగబోయేముందు, రెండు సేనల మధ్య లో, మరో గంటలో ప్రాణాలు ఉంటాయో - ఉండవో తెలియని క్లిష్టపరిస్థితిలో ఈ గీతాశాస్త్రమును భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడికి బోధించాడు. పూర్వకాలములో మన పెద్దలు అరణ్యాలలో చెట్ల క్రింద కూర్చుని పురాణాలు శ్రవణము చేసినట్లు మనము వింటున్నాము. కానీ, ఈ గీతాశాస్త్రము అటువంటిది కాదు. మరణము వచ్చి మీద పడుతున్న సమయము లో శాస్త్రము చెప్పట చాలా కష్టము.

మరో గంటలో మనకు ప్రాణము పోతుందని తెలిస్తే - ఈ మాటలు మనము చెప్పగలమా, లేక విన గలమా? అలా చెప్పట నారాయణుడైన శ్రీ కృష్ణ పరమాత్మకే సాధ్యపడింది - వినుట నరుడైన అర్జునుడికే సాధ్యపడింది. అటువంటి క్లిష్టపరిస్థితులలో ఏకాగ్రత కుదురుట చాలా కష్టము. ఈ ఒక్క సంఘటనను మనము దృష్టిలో పెట్టుకున్నప్పటికీ "శ్రీ కృష్ణుడు భగవంతుడే" అని మనకు తెలుస్తుంది. ఆయన దేహానికి,

srimmagaru.com

లోకానికి, అజ్ఞానానికి అతీతుడు కాబట్టే ఈ మాటల్ని చెప్పగలిగాడు.

దైవీగుణాలను, ఆసురీగుణాలను మనకు వివరించుట కోసం వాసుదేవస్వామి భగవద్గీతలో ఒక అధ్యాయమును ఖర్చుపెట్టాడు. దైవీ గుణాలను ఆర్జించ మని - ఆసురీ గుణాలను విసర్జించమని మనకు బోధించాడు. దైవీ గుణాలు మాత్రమే ఎందుకు ఉండాలి - ఆసురీ గుణాలు ఎందుకు ఉండకూడదని మీలో ఎవరికైనా సందేహము కలుగవచ్చును. దైవీగుణాలు ఉన్న వ్యక్తి బంధములో నుంచి బయట పడతాడు - ఆసురీ గుణాలు ఉన్న వ్యక్తి ఆరోజుకారోజు, ఆజన్మకాజన్మ బంధములో చిక్కుకుంటాడు. బంధమే దుఃఖానికి కారణము.

సద్గుణాలే మనిషికి నిజమైన సంపద. ఏ మనిషిలోనైనా కళ్యాణ గుణాలు గనుక ఉంటే - వాటిని పూర్వ జన్మలలో ఎంత కష్టపడి సంపాదించుకొన్నాడో! మన శరీరము పడిపోయిన తరువాత మన రూపాయ లు మనల్ని కనీసము గడపవరకు కూడా సాగనంపవు. కానీ, మనకున్న సద్గుణాలు మాత్రము ఈ శరీరము పడిపోయిన తరువాత కూడా మరుజన్మకు మనకు తోడువస్తాయి. కనుక సద్గుణాలను మించిన సంపద

srinannagaru.com

లేనేలేదు.

సత్యాన్ని దర్శించేవరకు, స్వరూపాన్ని తెలుసు కొనే వరకు ప్రతీజన్మలోను ఏదో ఒక రూపములో ప్రతీ వాడిని దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది. ఈదుఃఖ సముద్రములో నుంచి మనలను బయట పడవేయ గలిగినది - ఒక్క భక్తి మాత్రమే! భక్తి అంటే సామాన్య ముకాదు - అది మన తల్లితో సమానము.

ఎవరి మొఖము మీదా వీరు దేవతలని - వారు రాక్షసులని వ్రాసిలేదు. వారు చేసే పనులను బట్టి, వారి స్వభావాలను బట్టి ఎవరు ఎటువంటి వారో మనకు తెలుస్తుంది. దైవీ గుణాలతో ఉన్నవారు - ఈ సంసార సముద్రములో నుంచి, ఈ జనన మరణ చక్రములో నుంచి, అజ్ఞానమనే సుడి గుండములో నుంచి బయట పడతారు. ఏమిటా దైవీగుణాలు?

1. అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః
   దానం దమశ్చ యజ్ఞశ్చస్వాధ్యాయ స్తప ఆర్జవమ్।
2. అహింసా సత్యమక్రోధ స్త్యాగశ్శాంతి రపైశునమ్।
   దయా భూతేష్వలోలత్వం మార్దవం హ్రీరచాపలమ్॥
3. తేజఃక్షమా ధృతిశ్శౌచ మద్రోహో నాతిమానితా।
   భవన్తి సంపదం దైవీ మభిజాతస్యభారత।

srimmagaru.com

# వినండి

## I. అభయం :

అంటే భయము లేకుండుట. కానీ అజ్ఞానము ఉన్నంతకాలమూ ఏ జీవుడినీ భయము విడిచిపెట్టదు. మనలో జీవలక్షణాలు ఉన్నంతకాలమూ మనము అభయ స్థితిలో ఉండలేము.

"జీవితంలో అనేక కష్టసుఖాలు వస్తుంటాయి. దేనికీ భయపడవద్దు" అని భగవంతుడు చెపుతున్నాడు. ఎందుకు భయపడవద్దంటున్నాడు?

భయము జ్ఞాన విరోధి. ఏ విషయము గురించైనప్పటికీ భయపడుతుంటే - దుఃఖము వెంటాడి తీరుతుంది. భయము లోకముతో సంగమును చేకూర్చుతుంది. దాని వలన హృదయ వికాసము ఆగిపోతుంది. ఈ భయమునేది అజీర్తిరోగము లాంటిది. అజీర్తి రోగము గనుక ఉంటే - వాడు ఎంత తిన్నా అది వంటబట్టదు. అదే విధముగా మీలో ఎన్ని సుగుణాలు ఉన్నప్పటికీ మీరు భయపడుతున్నంత కాలమూ మీ సుగుణాలు రాణించవు. ఈ భయమే అనేక శారీరక, మానసిక రుగ్మతలకు దారి తీస్తున్నది.

srimammagaru.com

అసలు భయమనేది మనస్సులో ఉందిగాని - ఆత్మలో భయము లేదు. భగవంతుడు మనము ఆత్మ స్వరూపులమని చెప్పాడు గాని - మనస్స అని చెప్పలేదు. మరి మనము ఆత్మ స్వరూపులమైనప్పుడు ప్రతీ చిన్న విషయానికీ మనమెందుకు భయపడుతున్నాము? - ఆత్మ మన అనుభవములో లేదు గాబట్టి! మనము దేహానికి పరిమితమై - మనస్సు చుట్టూ, ఇంద్రియాల చుట్టూ తిరుగుతున్నంతకాలము భయము మనల్ని విడిచిపెట్టదు. ఆత్మ యొక్క అంతస్తులో నుంచి మనము జారకుండా చూసుకోవాలి. ఆత్మయొక్క అంతస్తులో నుంచి జారిపోతే ఎంతో కొంత భయము వేస్తూనే ఉంటుంది. మనము భయపడుతున్నంత కాలమూ మనకు జ్ఞానము పంటబట్టదు.

"భయమే మీకు రోగాన్ని తీసుకు వస్తుంది. భయమే మీకు దుఃఖాన్ని కలిగిస్తుంది. భయమే మీకు మరణాన్ని తీసుకువస్తుంది. కనుక ఎటువంటి పరిస్థితులలోనూ మీరు భయపడకండి" అని చెప్పాడు స్వామీ వివేకానంద!

"పిరికివాడు ప్రతిరోజూ మరణిస్తాడు. కానీ ధైర్యవంతుడు జీవితంలో ఒక్కసారే మరణిస్తాడు" అని

srimmagaru.com

చెప్పాడు ఆంగ్లకవి షేక్స్‌ఫియర్!

ద్వైతబుద్ధి ఉన్నంతకాలమూ ఏ జీవుడినీ వేరు భావన విడిచిపెట్టదు. వేరుభావన ఉన్నంతకాలమూ భయము వేస్తూనే ఉంటుంది. అద్వైతస్థితిని అందుకునేవరకు భయము విడిచిపెట్టదు. అందుచేత మనము అద్వైతస్థితికి చేరుకోవాలి.

భయము కూడా ఒక పాపమే! పాపమున్న చోట ఎంతో కొంత భయము కూడా ఉంటుంది. మీరు జ్ఞానాన్ని పొందకుండా, అద్వైతస్థితిని అందుకోకుండా, శాంతి శిఖరాన్ని చేరుకోకుండా - మీరు చేస్తున్న పాపమే భయము రూపములో మీకు అడ్డుపడుతున్నది. మనము పాపదూరులము కానంతకాలము భయము యొక్క కౌగిలిలో నుంచి బయట పడలేము.

అభయస్థితి జ్ఞానికి సహజము. కాని మనము అభయ స్థితిలో ఉండగలుగుతున్నామా? ఉండలేక పోతున్నాము. అందుచేత మనము అభయస్థితిని అభ్యాసము చేయాలి, అభ్యాసము చేయగా చేయగా ఆ అభయ స్థితిని మనము కూడా అందుకోగలము.

"మీకు ఎప్పుడైనా భయము వేస్తుందా?" అని శ్రీ రమణ మహర్షిని ఒకరు ప్రశ్నించారు. "నా కంటే వేరుగా మరొకటి ఉంటే కదా నేను చూసి భయపడటా

srimammagaru.com

నికి - నాకంటే వేరుగా మరొకటి లేదే?" అని అన్నారు.

మనము ప్రతి చిన్న విషయానికి భయపడుతున్నాము. దానిని బట్టి మన మనస్సు ఎంత అల్పత్వంలో ఉందో, ఎంత స్వల్పత్వంలో ఉందో మనకు తెలుస్తున్నది. అందుచేత మనము భగవంతుణ్ణి ప్రార్థించేటప్పుడు మనకు అభయస్థితిని ప్రసాదించమని అడగాలి.

"భయము ఎక్కడలేదో - అట్టి మహోన్నత స్థితికి నన్ను మేల్కొలుపు ఓ తండ్రీ!" అని ప్రార్థించాడు రవీంద్రనాథ్ ఠాగూర్ తన గీతాంజలిలో! ఆ స్థితి మనలోనే ఉంది. మనము నిరంతరము ఆ పరమేశ్వరుడిని ప్రార్థిస్తూ ఉంటే ఆ అభయస్థితిని అందుకొనే శక్తిని ఆయన మనకు ప్రసాదిస్తాడు. కనుక ప్రార్థన చాలా ముఖ్యము. అగ్గిపుల్ల చిన్నదే అయినప్పటికీ ఒక పెద్ద గడ్డిమేటును ఎలాకాల్చివేస్తుందో - అదే విధముగా "ఈశ్వరానుగ్రహం" అనే నిప్పు మన శిరస్సు మీద గనుక పడితే మనలోనున్న అజ్ఞానమంతా కాలిబూడిద అవుతుంది.

కష్టాలను చూసి భయపడకండి. అవి భగవంతుని ప్రసాదాలుగా స్వీకరించండి. జన్మ వచ్చిన తరువాత అనేక కష్టాలు వస్తుంటాయి. వచ్చిన కష్టాలను మీరు ఓర్పుతో సహజంగా భరించగలిగితే

srimmagaru.com

ఈశ్వరానుగ్రహం మీ మీద వర్షిస్తుంది.

మనము ఒక మొక్కను వేసి పెంచితే, అది ఏమీ కాయలు కాయకపోతే మనము ఎంతో బాధపడ తాము కదా - మరి మనకు జన్మ వచ్చినందుకు జ్ఞాన మనే పండు కాయలేదని బాధపడుతున్నామా? జ్ఞాన మనే పండును పొందలేకపోతే ఈ జన్మకు ఫలిత మేమిటి? మీలోనున్న భయమే జ్ఞానము మీ చేతికి అందకుండా మీకు అడ్డువస్తున్నదని ఎప్పుడు తెలుసు కుంటారు?

మీరు నిరంతరమూ ఆత్మను చింతిస్తే మీలో నున్న భయము జారిపోతుంది.

## 2. సత్వసంశుద్ధి :

అంటే అంతఃకరణశుద్ధి! ఏమిటా అంతఃకరణం - మనస్సు! మనస్సును శుద్ధిగా ఉంచుకోమంటున్నాడు వాసుదేవస్వామి. మనస్సును శుద్ధిగా ఉంచుకొనుట చేతకాకపోతే నేర్చుకోమంటున్నాడు. మరి మనస్స శుద్ధి ఎలా వస్తుంది? శ్రద్ధ వలన శుద్ధి వస్తుంది! శ్రద్ధలేని వాడికి అంతఃకరణ శుద్ధిరాదు.

అంతఃకరణ శుద్ధి లేకుండా ఎప్పడూ జ్ఞాని

srimannagaru.com

కాజాలదు. జ్ఞానికి అంతఃకరణ శుద్ధి సహజంగా ఉంటుంది. కాని దాని కోసము మనము ప్రయత్నము చేయాలి. మనము చూస్తున్న విషయములలోను, శ్రవణము చేస్తున్న విషయములలోను, మాటలాడే మాటల విషయములలోను, మనకు వచ్చే తలంపుల విషయములలోను మనము జాగ్రత్తగా ఉంటే మనకు అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. విస్తరిలో వడ్డించిన భోజనము తినుట ఎంత తేలికో - మనకు అంతఃకరణ శుద్ధి గనుక ఉంటే మనము జ్ఞానము పొందుట అంత సులభము. మనకు అంతఃకరణ శుద్ధి లేకపోవుటచేతనే జ్ఞానము మనకు అందుటలేదు.

'పరనింద, ఆత్మస్తుతి' - అంతఃకరణశుద్ధికి అవరోధము. అంతఃకరణమును శుద్ధి చేసుకొనుటయే జీవితములో మనము చేయవలసిన ముఖ్యమైన పని. దానిని మించినపని మరొకటి లేదు. ఉన్నదని మీకు అనిపిస్తే - మీ మనస్సు మిమ్మల్ని మాయచేస్తున్నట్లు గుర్తు! కొన్ని వాసనలతో మనము ఈ భూమి మీదకి వస్తే - కనీసము మనము మరణించేలోపులో ఒక్క వాసననైనా మనము తగ్గించుకొని ఈ లోకము నుంచి బయటికి వెళ్ళాలి. కానీ మనమేమి చేస్తున్నా మంటే - వంద వాసనలతో మనము ఈ భూమి

srimammagaru.com

మీదకు వస్తే, ఇంకా కొన్ని వాసనలను పోగుచేసుకొని మరిన్ని వాసనలతో ఈ దేహాన్ని విడిచిపెట్టి వెడుతున్నాము. అటువంటి పరిస్థితులలో మనకు అంతఃకరణ శుద్ధి ఎలా కలుగుతుంది? జ్ఞానము మనకు ఎలా అందుతుంది?

మానవుడు ఎంతవరకూ పవిత్రుడైతే అంత వరకే అతని మాటలయొక్క ప్రభావము పరిసరముల మీద పనిచేస్తుంది. సత్పురుషుని హృదయములో నుంచి వచ్చే ప్రతీమాట జ్ఞానమే, మన మనస్సు గనుక శుద్ధి అయితే మన హృదయములో ప్రకాశిస్తున్న పరమాత్మ మనకు ప్రత్యక్షమౌతాడు. అప్పుడు సంసార తాపము, సంసార దుఃఖము మనకు అంతమౌతుంది.

"హృదయశుద్ధి గలవారు ధన్యులు - వారు దేవుని చూచెదరు" అని అన్నాడు ఏసుక్రీస్తు.

మాలిన్యములేని స్థితి నిర్మలస్థితి. మన మనస్సులో మాలిన్యము ఉన్నంతకాలమూ ఉన్నదిలేనట్లు - లేనిది ఉన్నట్లు కనిపిస్తుంది. మన దేహానికి చెమట పట్టి దుమ్ము అంటినట్లు - మన మనస్సుని రాగద్వేషాలు పట్టి పీడిస్తున్నాయి. శరీరాన్ని నీటితో ఎలా శుభ్రము చేసుకొంటున్నామో - అదేవిధముగా మన మనస్సులో నున్న దోషాలను తొలగించుకొనుట కోసము పూజ

srimannagaru.com

చేయుమని, జపము చేయుమని, ధ్యానము చేయుమని, శ్రవణము చేయుమని, సద్గ్రంథములను పఠించుమని, సత్పురుషులతో సహవాసము చేయుమని మన పెద్దలు చెప్పారు. "శరీరమునకు స్నానము ఎటువంటిదో - మనస్సుకు ప్రార్థన అటువంటిది" అని అన్నారు మన జాతిపిత గాంధీజీ. ఉపవాసములైనా, సహవాసములైనా, ఏ నియమాలైనా నియమాలే మన గమ్యము కాదు. అంతఃకరణాన్ని శుద్ధి చేసికొని, ఒక పరమార్థాన్ని చేరుకోవటానికి ఈ నియమాలు సోపానాలుగా ఉపయోగపడతాయి.

ఎవరు ఏ మతములో పుట్టినప్పటికీ, ఏ దేవుని ఆరాధించినప్పటికీ, ఏ గురువును ఆశ్రయించినప్పటికీ, స్త్రీ లైనప్పటికీ, పురుషులైనప్పటికీ, ఈ లోకములోగాని - పరలోకములోగాని, ఈ జన్మలోగాని - మరో జన్మలో గాని "అంతఃకరణ శుద్ధి" అను గేటుద్వారా మాత్రమే మీరు మోక్షమును పొందాలి. అంతఃకరణ శుద్ధి అవకుండా ఎవ్వరూ మోక్షమును పొందలేరు. కనుక మీకు అంతఃకరణ శుద్ధి లేకపోతే - మీరు కష్టపడి సాధన చేసి సంపాదించుకోండి.

srinannagaru.com

# 3. జ్ఞానయోగ వ్యవస్థితి:

జ్ఞాన స్వరూపమైన ఆత్మను గూర్చి శ్రద్ధగా శ్రవణము చేసి, దానిని మననము చేయుటయే జ్ఞాన యోగము. మనస్సును ఇంద్రియములను ఆత్మయందు స్థిరముగా నిలబెట్టి యుంచుటయే వ్యవస్థితి:.

లోకములోని భోగముల మీదికి మనస్సు పరుగెడుతున్నంత కాలమూ - దానికి ఆత్మను గూర్చి శ్రవణము చేయాలని కూడా అనిపించదు. మరి శ్రవణము చేయకుండా ఆత్మ యొక్క వైభవము మనకు ఎలా తెలుస్తుంది? ఆత్మ ఔన్నత్యము మనకు అర్థమైతేనేగదా మనకు దానిని పొందాలనే కాంక్ష కలిగేది? మనస్సును అదుపు చేసుకొని, అంతర్ముఖ పరచినవాడికే ఆత్మంటే ఏమిటో అర్థమౌతుంది.

ఈ జీవుల అస్థిత్వానికి ఆత్మే ఆధారము. మన దేహము మరణించినప్పటికీ మరణములేని సద్వస్తువు ఒకటి మన హృదయములో ప్రకాశిస్తున్నది - అదే ఆత్మ! దానిని తెలుసుకొనుటయే మన జీవిత గమ్యము. కనుక ఆత్మను గురించి శ్రద్ధగా శ్రవణము చేయండి. శ్రవణము చేసిన దానిని శ్రద్ధగా మననము చేయండి. మననము చేసిన దానిని మీ మనస్సుకు పట్టించుకొని,

srimannagaru.com

దానియందే నిరంతరము మీ మనస్సును అగ్నము చేసి ఉంచండి. ఈ విధముగా జ్ఞాన యోగమును దీర్ఘ కాలము అభ్యసించుట వలన మీకు అహంకారముతో సంపర్కము తెగిపోయి ఆత్మ పదవిని అందుకుంటారు - అదే మోక్షం! ఆత్మకు మించిన జ్ఞానము లేదు. ఆత్మ జ్ఞానానుభవములో వినేది ఎవరు? చెప్పేది ఎవరు?

దారిద్రియముతో బాధపడుతున్న వాడికి భాగ్యము వచ్చి ఆ దారిద్రియాన్ని ఎలా ప్రక్కకు నెంటి వేస్తుందో - అదే విధముగా మీరు శ్రద్ధగా శ్రవణము చేయగా చేయగా మీకు జ్ఞానమనే భాగ్యము కలుగుతుంది. ఆ జ్ఞానము మీలోనున్న అజ్ఞానాన్ని సమూలముగా పెకిలించి అవతలపారవేస్తుంది. కనుక ఎవరైనా పెద్దలు గాని, గురువులుగాని ఆత్మను గురించి చెపుతుంటే శ్రద్ధగా, వినయంగా వినండి. శాస్త్రానికి పెడర్థాలు తీయకండి. కానీ, ప్రస్తుతము మన సమాజములో నున్న దురదృష్టము ఏమిటంటే - ఒక రాయికిస్తున్న విలువను ఒక అవతారపురుషునికి ఇవ్వరు. ఒక రాయికిస్తున్న విలువను ఒక జ్ఞానికి ఇవ్వరు. ఇదీ మన దురదృష్టము. గుడిలో మాత్రమే దైవమును దర్శించే వారు గుండెలోనున్న దైవమును దర్శించలేరు.

srimammagaru.com

అయితే "రాతి బొమ్మలో దేవుడు లేడా?" - అంటే ఉన్నాడు! ఆత్మను దేహానికే పరిమితము చేసుకొన్నవారికి - దేవుణ్ణి రాతికి పరిమితము చేసి చూపించారు మన పూర్వులు. రాయిలో కూడా దైవాన్ని చూడమని మన సంస్కృతి చాటుతున్నది. అలా చూడగలిగితే రాతి మనస్సులు కూడా బంగారు మనస్సులుగా మారతాయి. విగ్రహాల వలన నిగ్రహము గనుక వస్తే - విగ్రహారాధన యొక్క ప్రయోజనము నెరవేరుతుంది.

## 4. దానం :

మీకు కలిగినదానిని ఎదుటివారికి ఉచితముగా ఇస్తే - అదే దానము! మీకు డబ్బు ఉంది గదా అని ఏ దుర్గుణాలు ఉన్నవాడికో దానము చేస్తే - వాడుచేసే పాపములో కొంత మీకు కూడా వస్తుంది. కనుక పాత్ర ఎరిగి దానము చేయాలి. ధాంబికము కోసము దానము చేయకూడదు. ప్రచారము కోసము దానము చేయకూడదు. "మీ కుడిచేయి చేసిన పని మీ ఎడమచేతికి కూడా తెలియకూడదు" అని అన్నాడు ఏసుక్రీస్తు.

"ఇప్పుడు అందరూ దానాలు చేస్తున్నారు! కాని నీళ్ళు దొరకని చోట నుయ్యి తవ్వించమంటే

srimannagaru.com

తప్పించరు! ఆ గంగానది ఒడ్డునసే తప్పిస్తారు గొప్పల కోసము" అని చెప్పాడు స్వామి వివేకానంద.

మీరు ఇచ్చే దానము నిర్మలముగా ఉండాలి. ఆడంబరము లేకుండా ఉండాలి. ప్రచారము లేకుండా ఉండాలి. మూడో కంటివాడికి తెలియకుండా ఉండాలి. "వారిని మీ ఇంటికి రప్పించుకోనకుండా మీరే వారి ఇంటికి వెళ్ళి - పుచ్చుకుంటారో పుచ్చుకోరో, ఏమైనా అనుకుంటారేమోనని బిడియంతో, భక్తితో, శ్రద్ధతో ప్రశాంతచిత్తముతోటి ఇవ్వాలి" అని ఒక ఉపనిషత్తు చెప్పినది.

ఎవరైతే బాధపడుతున్నారో వారికి దానము చేయాలి. ఎవరైతే కష్టాల్లో ఉన్నారో, నష్టాల్లో ఉన్నారో, సంసార బాధలు మోయలేకపోతున్నారో వారికి దానము చేయాలి. ఎక్కడ ఇవ్వాలో, ఎప్పుడు ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో తెలుసుకొని ఇస్తే - ఈశ్వరుడు సంతోషించి మీరు మోక్ష సామ్రాజ్యము పొందుటకు తగిన అర్హతను మీకు కలుగచేస్తాడు. ఈశ్వరానుగ్రహంతో సాధించలేనిది ఏముంది?

మీరు ఎవరికైతే దానము చేసారో - వారు మిమ్మల్ని మరిచిపోయినా ఫరవాలేదు. వారు మీకు తిరిగి ఉపకారము చేయకపోయినా ఫరవాలేదు.

srimmagaru.com

వారు మీకు మోక్షాన్ని ఇవ్వరు. వారు మీకు శాంతిని ఇవ్వరు. సంతోషించవలసినది ఈశ్వరుడు. మీకు మోక్షాన్ని ఇచ్చేవాడు ఈశ్వరుడు. మీకు శాంతిని ఇచ్చే వాడు ఈశ్వరుడు. మిమ్ములను జ్ఞాన సింహాసనము మీద కూర్చోపెట్టేవాడు ఈశ్వరుడు.

మీరు ఎవరికైతే దానము చేస్తున్నారో వారు తిరిగి కృతజ్ఞతగా ఉండాలని, వారు మీకు బానిసలుగా ఉండాలని మీరు అనుకుంటే - అది దానమెలా అవుతుంది? ప్రతిఫలాన్ని ఆశించి చేసేది దానము కాదే! ప్రతిఫలాపేక్ష లేకుండా మీరు దానము చేస్తే - మీలోని పాపము తగ్గుతుంది, దోషము తగ్గుతుంది. ద్వేషము తగ్గుతుంది. మీ మనస్సు శుద్ధి కావటానికి ఆ దానము మీకు ఉపయోగపడుతుంది.

మీరు గొప్పలకోసము దానాలు చేస్తే తిప్పలు తప్పవు. చివరకు పేరులు, ఊరేగింపులే మిగులుతాయి గాని - జీవితంలో వికాసము కలుగదు. మరణానంతరము చీకటి లోకాలు మిగులుతాయి.

కనుక మీరు పవిత్రులగుట కోసమే దానము చేయండి. అలాచేస్తే మీకు జ్ఞానము కలుగుతుంది.

"ఎదుటివారికి ఇచ్చేది ప్రతీదీ తనకే తిరిగి వస్తుందని తెలిస్తే ఇవ్వకుండా ఎవరు ఉండగలరు?"

srimmagaru.com

అన్నారు భగవాన్ శ్రీ రమణ మహర్షి

# 5. దమశ్చ:

అంటే బాహ్యేంద్రియ నిగ్రహము. ఇంద్రియ నిగ్రహము లేకుండా నైతిక స్థాయిని పెంచుకోలేము. ఇంద్రియ నిగ్రహము ఆధ్యాత్మిక అభివృద్ధికి పునాది వంటిది. ఇంద్రియ నిగ్రహము లేనివాడు భగవంతుని దిశగా ప్రయాణము చేయలేడు. దిశలేని వాడికి దశ లేదు. ఇంద్రియ నిగ్రహము లేకపోతే జ్ఞానము స్థిర పడదు. చాపల్యమే మన అశాంతికి కారణము.

ఇంద్రియములను శిక్షించి, స్వాధీనము చేసు కొని క్రమపద్ధతిలో నడుపుకోవాలి. ఇంద్రియ నిగ్రహ ము కొరవడితే మానసికమైన అస్థిరత్వమునకు గురి అవుతాడు. ఆహార నియమము, సత్సంగము, సద్గ్రంథ పఠనము ఇంద్రియములను నిగ్రహించుకోను టకు సహకరిస్తాయి. ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము - ఇవి రెండూ కూడా సాధకుడికి ఆలంబనముగా ఉండి, ఆత్మ సాక్షాత్కారమునకు భావనా భూమికను సమకూర్చిపెడతాయి. అద్దము సహాయము లేకుండా మన మొఖమును మనము చూసుకోలేము. అదే విధముగా ఇంద్రియ నిగ్రహము లేకుండా మీరెవరో

srimammagaru.com

మీరు తెలుసుకోలేరు. లోకమును జయించుటకంటే ఇంద్రియములను జయించుట గొప్ప. ఇంద్రియములను జయించినవాడు జితేంద్రియుడు అవుతాడు - దేహ స్పృహ కూడా లేనివాడు అతీంద్రియుడు అవుతాడు. ఇంద్రియ జయము లేనివాడికి లోకము అదృశ్యము కాదు. లోకము అదృశ్యమైతేనేగాని దైవ దర్శనము కాదు.

మనిషి పతనమగుటకు ఒక్క ఇంద్రియములో బలహీనత వుంటే చాలును. ఇంక అన్ని ఇంద్రియములూ గనుక స్వాధీనములో లేకపోతే ఆ మనిషి పతనమౌతాడని వేరే చెప్పనక్కరలేదు. ఇంద్రియములు పెంకి గుఱ్ఱముల వంటివి. వాటిని బుజ్జగించి, మచ్చిక చేసుకొనుటకు మానవుడికి స్వప్రయత్నమే కాకుండా - ఈశ్వరానుగ్రహము కూడా అవసరము. "ఎంతటి వారైనా కామినీ కాంచనములకు దాసులే" అన్నాడు త్యాగరాజు. విషయములను చింతిస్తూ ఇంద్రియములను నిగ్రహించలేము. ఆత్మను చింతిస్తే ఇంద్రియ నిగ్రహము సాధించవచ్చును. స్వాధీనములో నున్న ఇంద్రియములు మనకు ఉపకారము చేస్తాయి- స్వాధీనములో లేని ఇంద్రియములు అపకారము చేస్తాయి. మీ ఇంద్రియాలే గనుక మీ స్వాధీనములో

srinannagaru.com

ఉంటే ఈ లోకమంతా ఏకమైనా మిమ్మల్ని ఏమీ చేయలేదు. ఇంద్రియములను నియమించినవాడికి ప్రకృతి రహస్యములు తెలుస్తాయి.

శత్రువులు ఎక్కడో బయట ఉన్నారనుకుంటు న్నాము. కానీ మన ఇంద్రియాలే మనకు శత్రువులు. పాములు ఎక్కడో పుట్టల్లో ఉంటాయనుకుంటున్నాము. కానీ మన ఇంద్రియాలు పాములకంటే కూడా ప్రమాద మైనవి. పాముకాటు వేస్తే ఆ దేహమే నశిస్తుంది. కానీ ఇంద్రియాలకు లొంగిపోతే ఎన్నో నికృష్టమైన జన్మలు ఎదురు వస్తాయి. ఈశ్వరుడు పాములతో అలంకరిం చుకొన్నాడంటే ఏమిటి? -స్వాధీనమైన ఇంద్రియాలను ఆభరణములుగా అలంకరించుకున్నాడు. ఈ లోకాన్ని చూసి మోహించమని మన ఇంద్రియాలే మనల్ని మోహపరుస్తున్నాయి కాని - ఈ లోకము తనను మోహించమని అడుగుటలేదు.

"నాకు ఒక దేహముందని, దానికి రెండు చేతులు ఉన్నాయని, అందులో ఒక చేతిమీద కురుపుం దని - మీరు చెపుతుంటే నాకు తెలుస్తోంది" అన్నారు శ్రీ రమణస్వామి. అది పరాకాష్ఠ! దేహమే లేనివాడికి ఇక ప్రారబ్ధముతోటి, లోకముతోటి, ఇంద్రియములతోటి పనేముంది?

srinannagaru.com

# 6. యజ్ఞశ్చ :

ప్రతిఫలాపేక్ష లేకుండా పనిచేయుట యజ్ఞము. యజ్ఞము గురించి వేదములలో, స్మృతులలో విపులము గా వర్ణించినారు. జ్ఞానయజ్ఞము, ద్రవ్యయజ్ఞము, తపో యజ్ఞము, దేవయజ్ఞము, పితృయజ్ఞము - ఈ విధము గా మన శాస్త్రములలో అనేక యజ్ఞములను గూర్చి చెప్పబడినది.

భగవంతుడు ఇక్కడ జ్ఞానయజ్ఞమును గూర్చి చెపుతున్నాడు. భగవంతుని ఆదేశములను అనుస రించి భగవంతుని పక్షమున పనిచేయువాడు యజ్ఞ స్వరూపుడే! యజ్ఞమంటే ఈశ్వరుడు. సృష్టిక్రమము నడుచుటకు, జీవుడు ఈశ్వరస్వరూపమును పొందు టకు ఈ లోకములో యజ్ఞము ప్రతిష్ఠింపబడినది. మన ఇంద్రియములను, మన కోరికలను, మన ఉద్రే కములను, మన ఆగ్రహమును నిగ్రహించుకొనుట కూడ యజ్ఞముతో సమానమే. విషయచింతనను విడిచి పెట్టుటకు కావలసినది ఆవేశము కాదు - ఆలోచన, ఆవేదన కావాలి. ఇంద్రియములు నిగ్రహించ బడకుండా, మనస్సు చల్లబడకుండా బ్రహ్మనిష్ఠ కుదరదు. బ్రహ్మము యజ్ఞములో స్థిరపడి యున్నది.

srimmagaru.com

అందువలన సృష్టిక్రమము కలకాలమూ జరుగుతూనే ఉంటుంది.

శ్రీకృష్ణుడు, జనకుడు ఈ లోకములో నివసించి, లోకవాసన అంటకుండా యజ్ఞభావనతో పని చేసినవారిలో ముఖ్యులు. ఫలితముకోసము ఆశించి పనిచేయువాడు కూలివాడు - ఫలాపేక్ష లేకుండా పని చేయువాడు యజ్ఞస్వరూపుడు. జీవితము పొడుగునా ఇంద్రియములతో ఆడుకోవటానికి మాత్రమే అలవాటు పడినవాడు తనకుతానే చెడుచేసుకుంటున్నాడు. అట్టి అల్పాత్మునకు యజ్ఞభావన కుదరదు.

ఫలాపేక్ష లేకుండా పనిచేస్తే మనకు ఈశ్వరుడు ఫలితాన్ని ఇస్తాడు - అంతఃకరణాన్ని శుద్ధిచేస్తాడు. కాని, నేటి సమాజానికి స్వార్థమే పరమార్థము. స్వార్థానికి, రాగ ద్వేషాలకు, అహంకారానికి, అజ్ఞానానికి పరిమితమై ఈ దేహమును కేంద్రముగా పెట్టుకొని దేవుని కోసము ప్రార్థనలు చేస్తుంటే - అది యజ్ఞమెలా అవుతుంది? జీవితములో ఎప్పుడైనా మన దేహాన్ని మనము మర్చిపోయామా? మరి, మనల్ని మనము మర్చిపోనంత కాలము యజ్ఞభావనతో ఎలా పనిచేయగలము? దేహగతమైన "నేను"కే మనము పరిమితమై ఉన్నంత కాలము సమాజమును సేవించలేము. సమాజము

srimannagaru.com

కోసము జన్మించి, సమాజము కోసము జీవించి, సమాజము కోసము మరణించిన మహాత్ములందరూ యజ్ఞ స్వరూపులే.

ఇక్కడ అగ్నిహోత్రమునకు సంబంధించిన యజ్ఞ యాగాలు చేస్తే చనిపోయిన తరువాత స్వర్గాని కో, వైకుంఠానికో వెళ్ళవచ్చునని మనము అనుకుంటు న్నాము. స్వర్గానికో, వైకుంఠానికో వెడితే మాత్రము అక్కడ మనమెంతకాలముంటాము? ఈ పుణ్యఫలము ఖర్చైపోయిన తరువాత తిరిగి ఈ భూమి మీదకు రావలసినదే.

"కర్మ ఫలము అశాశ్వతము మాత్రమే కాదు - అది గతిని కూడ నిరోధిస్తుంది" అన్నారు శ్రీ రమణా చార్యులు.

మీరు స్వర్గంలో సుఖముందనుకుంటున్నారు. ఈ లోకంలోగాని - పరలోకంలోగాని ఆత్మకు మించిన సుఖముందా? ఒక్కసారి మీ స్వరూప సుఖాన్ని గనుక మీరు పొందితే - అలౌకికమైన ఆనందము మీ అనుభ వములోనికి వస్తుంది. కోరికలతో ఎన్ని వ్రతాలు చేసినా, ఎన్ని యజ్ఞాలు చేసినా, ఎందరు దేవతలను సంతృప్తిపరచినా జన్మజన్మలకూ దుఃఖము మిమ్ములను వెంటాడుతూనే ఉంటుంది. కోరికలు సమూలంగా

srimamagaru.com

రాలిపోతే దుఃఖము ఆరిపోతుంది. జ్ఞాని అనుభవించే సుఖముతో పోలిస్తే ఆ దేవతలు అనుభవించే సుఖము కోటవ వంతు కూడా ఉండదు - అదీ జ్ఞాని యొక్క వైభవము. ప్రతిఫలాపేక్ష లేకుండా పనిచేస్తే మీరు కూడా జ్ఞానులౌతారు.

మనకున్న దానిని స్వార్థచింతన లేకుండా ఎదుటివారికి దానము చేస్తే - దానిని ద్రవ్య యజ్ఞము అంటారు. మనము ఇంటిలో వున్నా - అడవిలో వున్నా మన మనస్సును గనుక మనము నిగ్రహించుకోగలిగితే దానిని యోగయజ్ఞము అంటారు. మనకు అర్థము తెలియకపోయినా శాస్త్రాన్ని గనుక అధ్యయనము చేస్తే దానిని స్వాధ్యాయ యజ్ఞము అంటారు. మనము శాస్త్రాన్ని పఠిస్తూ దానిని అర్థము చేసుకోగలిగితే దానిని జ్ఞానయజ్ఞము అంటారు.

ఎంత ధ్యానము చేసినా, ఎన్ని యజ్ఞములు చేసినా - వాటి ఫలం మాత్రము జ్ఞానమే! సమత్వ బుద్ధితో మనల్ని మనము అలంకరించుకుంటే - దానికి మించిన యజ్ఞము లేదు. దానికి మించిన యోగము లేదు. యోగికి స్వపరబేధము లేదు.

srimammagaru.com

# 7. స్వాధ్యాయం :

అంటే శాస్త్రాన్ని పఠించుట. మనకు అనేక శాస్త్రములున్నవి. అన్ని శాస్త్రముల సారమూ గీతలో ఇమిడి ఉన్నది. గీతాగ్రంథము గ్రంథములకు మహారాజు. గీతా శాస్త్రమును చదివితే సర్వశాస్త్రములు చదివిన ఫలము వచ్చును. భగవంతుణ్ణి ఎలా ఆరాధించాలో, భగవంతుని కుటుంబమైన సమాజమును ఎలా సేవించాలో శాస్త్రమును పఠిస్తేనేగాని మనకు తెలియదు.

శాస్త్ర పఠనము, శాస్త్ర శ్రవణము మనస్సు అంతర్ముఖమగుటకు సహాయపడుతుంది. ఆత్మనిష్ఠ కుదురుతుంది. మనస్సు కూడ ఒక సంపదే! ఈ సంపదను మీరు అభివృద్ధి చేసుకుంటే దైవీగుణముల చేత అలంకరింపబడతారు. భగవంతుణ్ణి ఆరాధించి మీరాబాయి ద్వారకలోనున్న శ్రీ కృష్ణమూర్తి విగ్రహము లో లీనమైంది. అదే విధముగా ఆండాళ్ళ శ్రీరంగములో వేంచేసియున్న రంగనాథస్వామి విగ్రహంలో లీనమైంది. అనేకమంది మహాత్ములు తమ ఎముకలు అరిగేలా సమాజమునకు సేవచేసి పరమాత్మలో లయమైనారు. ఎన్నో శాస్త్రములను పఠించి, అర్థము చేసుకొని, ఆచరించుట వలన శ్రీ అరవిందుడు మహాయోగి అయి

srimannagaru.com

నాడు. శాస్త్ర పఠనము వలన ఏకాగ్రత కుదురుతుంది. ఏకాగ్రత లేనివాడు ఏదీ సాధించలేడు. శాస్త్రమును తెలుసుకోవాలని అనుకుంటే చాలదు - దానికోసము ప్రయత్నము చేయాలి. భోగమునకు అలవాటుపడిన వాడు శాస్త్రమును పఠించలేడు - పండితుడు కాలేడు. శాస్త్రపరిచయము లేనివాడికి ఋషిధర్మము, యోగి ధర్మము తెలియదు. శాస్త్రమును పరిశీలించి, పరిశోధించి, మన హృదయమును తడుముకొని అందులో దోషములు గనుక ఉంటే వాటిని బయటకు తీసి, వాటిని మంటపెట్టవలెను. ఈ భూమి మీద ఉండగా మన జీవితమును సద్వినియోగము చేసుకుంటే ముక్తి పొందవచ్చును.

మనకు పొట్ట ఉంది. కనుక తిండి అవసరము. ఆ తిండి కోసము ఏదో ఒక వృత్తిని చేసుకోవాలి. అందువలన వృత్తి విద్యలన్నీ పొట్టకు పరిమితమై వున్నవి. వృత్తి విద్యలు అశాంతినుండి మనల్ని విడిపించలేవు. ఏ విద్య అయితే మనల్ని అవిద్య నుంచి విముక్తి చేస్తుందో - అదే నిజమైన విద్య - అదే ఆత్మవిద్య! ఆత్మ నిజం! దానిని మనము నమ్మకపోయినా అది ఉంది. లోకము నిజమువలె కనిపిస్తున్నది - కాని ఆత్మానుభవములో అది అదృశ్యమౌతుంది. శాస్త్రములో ఆత్మ లేదు. కాని,

srimanmagaru.com

మన హృదయములో స్వయముగా ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకొనుటకు శాస్త్రము సహాయపడు తుంది.

శ్రీకృష్ణ పరమాత్మ గీతలో ఎంతో ప్రేమతో ఎన్నో విషయములు చెప్పాడు. ఏది చేయాలి - ఏది విడిచి పెట్టాలి అను విషయము గీతలో వివరముగా చెప్పబడి నది. గీతాశాస్త్రమును ఆశ్రయించి, అందులో చెప్ప బడిన మాటలకు అనుగుణముగా జీవిస్తే మనస్సు - తెలుపు అవుతుంది. గీత మీద మమకారం పెంచు కుంటే - లోకముమీద ఉన్న మమకారం తగ్గుతుంది. హృదయములోనున్న శోకము హరించిపోతుంది. గీతను గురించి చర్చించుకోండి. అందులో చెప్పిన మాటలను మోసుకుతిరగండి. శక్తిని అనుసరించి ఆచరించండి. గీతా తాత్పర్యమును అర్థము చేసుకొను టకు మన బుద్ధికి బలము సరిపోదు. కనుక గీతా చార్యునిపట్ల ప్రీతిని పెంచుకుంటే - గీతను అర్థము చేసుకునే బుద్ధిని, అందలి విషయములను ఆచరించే శక్తిని ఆయనే మనకు ఇస్తాడు. ఏదిమంచి - ఏది చెడు అను విషయమును శాస్త్రమును ఆధారము చేసుకొని నిర్ణయించుకోవాలి. ఏది చెడ్డదో మనకు తెలిస్తే దాని ఆకర్షణ నుండి మనము శాస్త్ర సహాయ

srimmagaru.com

ముతో, దైవ సహాయముతో, గురువు సహాయముతో బయటికి రావచ్చును. గీతను శ్రద్ధగా అధ్యయనము చేస్తే - వివేకము కలిగి, మానసికముగా ఎదుగుతారు. కనుక అనుదినము గీతా పఠనమునకు ఒక గంట కేటాయించుకోండి. అజ్ఞాన సముద్రమును దాటుటకు గీతాశాస్త్రము మనకు ఓడవలె ఉపయోగపడుతుంది. గీతా విద్యార్థికి బూటకపు మాటలతో, ములికి మాటల తో పని ఉండదు. గీతలో చెప్పిన యోగ మార్గము మీకు కష్టముగా కన్పించినా ఆచరించుట మానకండి. గీతామాతను పూజించండి. గీతా జయంతిని జరపం డి. మీకు గీతాగ్రంథము లేకపోతే వెంటనే కొనండి. "మన నుదుటవ్రాత బాగులేకపోతే గీతాగ్రంథము మన చేతికి రాదు" అన్నారు మహర్షి మళయాళస్వాముల వారు. "భారతము మధ్యలో భగవద్గీత ఉంది గనుకనే అది మహాభారతము అయింది" అన్నారు శ్రీ మధ్వా చార్యులవారు. గీతకు వ్యాఖ్యానము వ్రాసి, ప్రచారము లోనికి తీసుకువచ్చిన ఆదిశంకరాచార్యులవారికి మనము ఎంతో ఋణపడి ఉన్నాము.

దేహము చుట్టూ, ఇంద్రియముల చుట్టూ, అహంకారము చుట్టూ తిరుగుతూ కాలము వృధా చేయకండి. అన్ని యోగములు జ్ఞానములో లయమౌ

srimannagaru.com

తాయి. జ్ఞానికి రాగద్వేషములుండవు. అందుకే జ్ఞాని సమక్షములో ఊహాతీతమైన శాంతిని, అలౌకికమైన ప్రశాంతిని అనుభవించవచ్చును. కనుక శ్రద్ధగా శాస్త్రాన్ని పఠించండి - మీ వివేకాన్ని పెంచుకోండి - జ్ఞానులుకండి - తరించండి.

"నేను ఎంతకాలమైతే జీవించి ఉంటానో - అంత కాలమూ నేర్చుకుంటూనే ఉంటాను" అని శ్రీరామకృష్ణ పరమహంస అంతటివారన్నారు.

## 8. తపస్సు :

శరీరమును శిక్షించి శరీరమును స్వాధీనము చేసుకోవాలి. వాక్కును నియమించి వాక్కును స్వాధీనము చేసుకోవాలి. మనస్సును నియమించి మనస్సును స్వాధీనము చేసుకోవాలి - అదే తపస్సు!

గీతలో 17వ అధ్యాయములో తపస్సును గురించి భగవంతుడు మూడు శ్లోకములు ఖర్చు పెట్టాడు. శారీరక తపస్సు అని, వాచక తపస్సు అని, మానసిక తపస్సు అని - మూడు విధములగు తపస్సు లను గురించి వివరించాడు.

దేవతలను పూజించుట, పెద్దలను గౌరవించుట,

srimannagaru.com

సన్మార్గములో ప్రవర్తించుట, శరీరమును శుచిగా ఉంచుకొనుట, ఇతరులను హింసించకుండుట, ఇతరులను మోసగించకుండుట, వ్రతములలోకెల్ల మహా వ్రతమైన బ్రహ్మచర్య వ్రతము పాలించుట - ఇవి శారీరక తపస్సు అని భగవంతుడు చెప్పాడు.

ఇతరులకు భయము కలుగజేయకుండుట, ఇతరుల మనస్సును నొప్పించకుండుట, సత్యమును పలుకుట, హితవుగా మితముగా ప్రియముగా మాటలాడుట, శాస్త్రములను పఠించుట, మంత్రమును జపించుట - ఇవి వాచక తపస్సుఅని భగవంతుడు చెప్పాడు.

మంచి మనస్సు కలిగియుండుట, మనో నిగ్రహమును సాధించుట, సకల జీవులకు మేలుకోరుట, నిరంతరము ఆత్మను ధ్యానించుట, పవిత్రత కలిగియుండుట -ఇవి మానసిక తపస్సుఅని భగవంతుడు చెప్పాడు.

"నేను అను తలంపు ఎక్కడ పుడుతుందో చూడు - అక్కడే మనస్సు లయిస్తుంది - అదే తపస్సు!" అని చెప్పారు శ్రీ రమణాచార్యుడు.

మనము అంటున్న "నేను" దేహగతమైనది. ఈ దేహాగతమైన "నేను" నుండీ, ఈ అహంకారగతమైన "నేను'' నుండి విడుదల పొందుటకు చేయు

srimannagaru.com

ప్రయత్నము కూడా తపస్సే! మనముగాని దేహము, మనముగాని మనస్సు మనమని అనుకున్నంత మాత్రము చేత అది వాస్తవముగాదు. మనము ఎవరు గానున్నామో అట్టి ఆత్మ అహంకారముకాదు. ఆత్మ అరూపమే! అట్టి ఆత్మానుభవమును, ఆత్మ నిష్ఠను పొందుటకు చేయు ప్రయత్నమే తపస్సు. రూపము నశించినప్పటికీ దానికి ఆధారముగానున్న ఆత్మ నశించదు. యజ్ఞభావనతో పనిచేస్తే దేహబుద్ధి నశించి ఆత్మబుద్ధి కలుగుతుంది. ఆత్మానందముతో సమానమైన ఆనందము లేనేలేదు. ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహించి, లేని వస్తువును లేనట్లుగా తెలుసు కొనుటయే తపస్సు యొక్క ప్రయోజనము. తపస్సు చేసి మనస్సులోనున్న బలహీనతలను పోగొట్టుకుంటే ధ్యానము కుదురుతుంది. జ్ఞానము కలుగుతుంది.

మనకు వచ్చే తలంపులలో "నేను" అను తలంపు ప్రథమ తలంపు. ప్రధాన తలంపు. ఈ "నేను" అను మొదటి తలంపుపైనే ఈ సమస్త సృష్టి ఆధారపడి యున్నది. ఈ మొదటి తలంపునే అహంకారమని అంటారు. దీనినే వేదాంతపరిభాషలో కారణ శరీరమని అంటారు. ఈ కారణ శరీరమును తపస్సు చేసి తెంపు కుంటే సంసారములో సారము లేదని తెలుస్తుంది.

srinannagaru.com

ఈ నేను - దానికి వచ్చు మిగిలిన తలంపులు కలిసి మనస్సు అయినది. "నేను" అని మన మనస్సే అంటున్నది. మనస్సు యొక్క పుట్టుచోటును తెలుసుకునే వరకు సత్యము తెలియదు - మనిషి బంధములలో నుంచి బయటపడలేడు. "నేనెవడను?" అని విచారణ చేసి, దృశ్యవృత్తి నుంచి మనస్సును అణ్డగించి, దాని పుట్టుచోటైన హృదయములో మనస్సును నిలబెట్టి ఉంచగలిగితే తత్వము వ్యక్తమౌతుంది - జ్ఞానము కలుగుతుంది. భగవంతుని స్వరూపమును పొందుటయే తపస్సు యొక్క ప్రయోజనము.

తపస్సు యొక్క గొప్పతనమును గూర్చి వేదములలో చర్వితచర్వణముగా చెప్పబడినది. సిద్ధార్థుడు తపస్సు చేసి బుద్ధుడైనాడు. బుద్ధుని జీవితములో తపశ్చర్య ముఖ్యమైన అంగము. తపస్సు చేత బుద్ధుని హృదయము శాంతితో నిండినది. అందువలన ఆయన లోకమును ఎంతగానో ప్రేమించగలిగాడు, కోరికలను త్యజించగలిగాడు. కోరికలు వున్నవాని హృదయము నుండి దయ, సానుభూతి, ప్రేమ ప్రవహించవు. దుఃఖము వాడి శరీరమును కాల్చివేస్తుంది - మనస్సును కలచివేస్తుంది. తపస్సు చేసి దుఃఖములేని స్థితిని పొందవచ్చును.

srimannagaru.com

ప్రహ్లాదుడు భగవంతుణ్ణి స్మరించి స్మరించి ఆయన సాక్షీప్యమును పొందగలిగాడు. గణపతి శాస్త్రి గారు చేసిన తపస్సుకు ఫలితముగా శ్రీరమణ దేవుడు గురువుగా లభించినాడు.

తపస్సు మనస్సును శుద్ధిచేస్తుంది. శుద్ధివలన సిద్ధులు వస్తాయి. సిద్ధులన్నిటిలోను ఆత్మ సిద్ధికి మించిన సిద్ధిలేదు. ఇతర సిద్ధులన్నీ స్వప్నమయితో సమానము. తపస్సు వలన మనస్సుకు స్వస్థత చేకూరి ఆత్మసిద్ధి కలుగుతుంది. అదియే అన్ని యోగములసారము.

" 'నేను' అనునది లేని స్వానుభవనిష్ఠయే గొప్ప తపస్సు" అని తపస్సు యొక్క స్వరూపమును గూర్చి భగవాన్ శ్రీరమణ మహర్షి నిర్వచనము చెప్పినారు.

తపోధనము లేకపోతే ధనాభిమానముగాని, దేహాభిమానముగాని నశించవు. తపస్సు చేసి విద్యను పొందవచ్చును. ధనముపోయినా, సుఖముపోయినా, కీర్తిపోయినా - తపస్సు విలువ తెలిసినవాడు తపస్సు నుంచి వెనుకకు మరలడు. ఎన్ని విఘ్నములు ఎదురైనప్పటికీ కౌశిక మహారాజు తపస్సు చేసి చేసి బ్రహ్మఋషి విశ్వామిత్రుడు అయినాడు - సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగాడు. తపస్సునకు అసాధ్యమైనదంటూ ఏదీ లేదు.

srimammagaru.com

# 9. ఆర్జవమ్ :

అంటే న్యాయమైన మార్గములో నడుచుకోవాలి. ఋజువర్తనము కలిగి ఉండాలి. కపటము లేకుండా జీవించాలి.

న్యాయమైన మార్గములో నడుచుకుంటే, సహజమైన మార్గములో నడుచుకుంటే, సరళమైన మార్గములో నడుచుకుంటే, స్వచ్ఛమైన మార్గములో నడుచుకుంటే - ఇంద్రియములు స్వాధీనములోనికి వస్తాయి.

వినయమును విడిచిపెట్టకండి. భగవంతుని పాదాలను సేవించండి. భగవంతుడు సర్వజ్ఞుడు. మన తలంపులకు సాక్షిగా వున్నాడు. ఆయనను మనము మోసగించలేము. స్వచ్ఛమైన, సుందరమైన మార్గములో ప్రయాణము చేసే వాడికి మాత్రమే పరమ శాంతి లభ్యమౌతుంది. శాంతిలేని వాడికి సుఖము లేదు.

మంచివారిని గౌరవించి, ఆదరించి, వారితో సహవాసము చేస్తుంటే కపటము లేని స్థితిని పొందవచ్చును. ఆధ్యాత్మిక వికాసమునకు మంచితనము పునాది వంటిది. మంచిని ప్రేమించలేకపోతే ఆత్మ అనుభవములోనికి రాదు. ఎదుటి వారిలోని దోషములను వెదకినట్లే - మనలోనున్న దోషములను మనము

srinannagaru.com

చూచుకుంటే - కాలక్రమములో అవి తొలగిపోతాయి, స్వార్థ చింతనలేని జీవితములో ఎదుగుతావు, నిష్కపటముగా జీవించుటకు అలవాటు పడతావు. ఋజుమార్గములో నడుచుకునేవాడు ప్రత్యేకమైన గౌరవాలను గాని, కీర్తినిగాని కాంక్షించడు. ఋజు మార్గములో లేనివాడు భౌతిక పదార్థముల మీద ఆధార పడి - వాటికి అతీతముగానున్న బ్రహ్మ పదార్థమును వాడు గుర్తించలేడు.

ఏదైతే మన హృదయములో ఉందో - అదే చెప్పాలి. ఏదైతే చెపుతున్నామో - అదే చేయాలి. మనస్సు, మాట, చేత - ఈ మూడూ ఒకటిగా వుండాలి - అదే ఆర్జవమ్! అలా నడుచుకుంటే మన ఇంద్రియ ములు మన స్వాధీనములోనికి వస్తాయి. స్వాధీనమైన ఇంద్రియములు కలవాడికి ఈ సృష్టిలో సాధించలేనిది ఏముంది?

## 10. అహింస :

ఏ జీవులనూ హింస పెట్టకుండుటయే అహింస.

ఎదుటివారికి ఉపకారము చేస్తే అది అహింస - అపకారము చేస్తే అది హింస. కష్టాలలోనున్న వారిని చూసి మీకు సంతోషము కలుగుతుంటే - మీరు

srimmagaru.com

అహింసా విధానానికి ఇంకా అలవాటు పడలేదని గుర్తు.

మనము మనస్సుతోగాని, మాటతోగాని, దేహముతోగాని ఎవరినీ బాధపెట్టకూడదు. ఎదుటి వారిని బాధ పెడితే పరిణామములో మనము బాధకు గురికాక తప్పదు. ఎదుటివారికి అపకారము చేస్తే మనము అపకారానికి గురికాక తప్పదు. ఎదుటి వారికి ఉపకారము చేస్తే మనము ఉపకారము పొందుతాము. ఈ జన్మలో మనము చేసిన పనులే మరుజన్మలో మనకు ఎదురువస్తాయి - ఇది ఈశ్వరుని చట్టం! ఎవరికీ తెలియకుండా మీరు ఎంతో రహస్యముగా చేసిన హింసా కార్యములు ఏనాటికైనా వెలుగులోనికి వస్తాయి. కర్మేంద్రియములతో మనము చేసిన కుచేష్టలు వాసనలుగా మారి, అజ్ఞానమును పెంచి, భవిష్యత్తులో అనేక నీచ జన్మలకు కారణమవుతాయి. అహింసను పిరికి వాళ్ళు బోధించలేరు - ఆచరించ లేరు. అహింసను జీవితములో ఒక భాగముగా చేసు కొనుటకు ధైర్యము అవసరము.

మానవుడికి తన తోటివారు పెట్టే హింసకంటే తన రాగ ద్వేషాలు, కామక్రోధాలే అతనిని ఎక్కువ హింసకు గురిచేస్తున్నాయి. బయటనున్న శత్రువుల కంటే తన అంతఃకరణములో నున్న దోషములే అతనికి

srimmagaru.com

శత్రువులుగా పరిణమిస్తున్నాయి. సజ్జన సాంగత్యము వలన, సత్యాత్మను నిరంతరము ధ్యానించుట వలన అంతఃకరణము బాగుపడుతుంది. అంతఃకరణమును బాగుచేసుకొనుట కంటే మించిన విద్యలేదు. సాధకుడికి అహింసా వ్రతము, బ్రహ్మచర్య వ్రతము ముఖ్యమైనవి.

హింస వలన హింస పరిష్కారము కాదు. హింసకు అహింస మాత్రమే పరిష్కారము. హింసకు అలవాటు పడిన నరుడు ఆరోజుకారోజు హీన స్థితికి దిగజారి, నరరూప రాక్షసుడౌతాడు. హింస వలన మిగిలేది పాపము మాత్రమే. అది భవిష్యత్తు జన్మలలో ఎదురౌతుంది. అహింసే మానవుడికి నిజమైన అలంకారము.

అహింసా సిద్ధాంతమును ఆధారముగా పెట్టుకొని జీవించిన వారిలో గౌతమబుద్ధుడు అగ్రగణ్యుడు.

మన జాతిపిత గాంధీజీ అహింసను ఆయుధము గా తీసుకొని మన దేశమునకు స్వరాజ్యమును సాధించి పెట్టారు.

srimannagaru.com

# II. సత్యం :

ఏది సత్యం? ఆత్మ సత్యం! సత్యమే ఈ లోకాన్ని నడిపిస్తున్నది. ఈ లోకానికి ఆధారముగా ఉన్నది. పర లోకాలకు ఆధారముగా ఉన్నది, దేవతలకు ఆధారము గా ఉన్నది, మీకు ఆధారముగా ఉన్నది, నాకు ఆధార ముగా ఉన్నది, పరమేశ్వరుడికి ఆధారముగా ఉన్నది - సత్యమే.

సత్యానికి మించిన మతము లేదు. సత్యానికి మించిన కులములేదు. సత్యానికి మించిన జాతి లేదు. సత్యానికి మించిన వస్తువు లేదు. సత్యానికి మించిన జ్ఞానములేదు. సత్యానికి మించిన దేవుడు లేడు.

సత్యాన్ని ఎవడు ప్రేమిస్తున్నాడో, సత్యము కోసము ఎవడు జీవిస్తున్నాడో, సత్యము కోసము ఎవడు మరణి స్తున్నాడో, సత్యము కోసము ఎవడు తన సర్వస్వాన్ని ధారపోస్తున్నాడో - వాడికే సత్యము దర్శనమిస్తుంది.

సత్యాన్ని చెప్పమని, ధర్మాన్ని ఆచరించమని మన వేదము బోధిస్తున్నది. సత్యముపట్ల మనము ప్రీతిని పెంచుకోవాలి. సత్యాన్ని అభ్యసించుట నేర్చుకొనుటయే సాధన. సత్యము కోసము సర్వస్వము త్యాగము చేయుటకు సిద్ధపడిన జీవాత్మ పరమాత్మ అవుతుంది.

srimannagaru.com

సత్యానికి మరోపేరే భగవంతుడు! సత్యమును, ధర్మము ను పూర్తిగా ఆచరించలేకపోయినా కనీసము వాటిని గౌరవించుట అయినా మనము నేర్చుకోవాలి.

సత్యమే ఆనందం, సత్యమే శివం, సత్యమే సుందరం, సత్యమే శాంతి, సత్యమే మౌనం! దేనిని దాచిపెట్టినా, దేనిని పాతిపెట్టినా, దేనిని కాల్చి బూడిద చేసినా - సత్యాన్ని దాచలేము, సత్యాన్ని పాతిపెట్టలేము, సత్యాన్ని బూడిద చేయలేము. సత్యము యొక్క విలువ, సత్యము యొక్క బరువు మనకు తెలియకపోవుటకు కారణము - పాపమే! పాపి జ్ఞాని కాలేడు.

## 12. అక్రోధ :

పరిస్థితులు ప్రతికూలముగా ఉన్నప్పటికీ కోపము లేకుండా ఉండుట అక్రోధము.

ఎందుకు కోపాన్ని దూరముగా విడిచి పెట్టాలి? తరచుగా కోపానికి గురి అవుతుంటే దుఃఖమునకు లోనౌతాము. కోపము అగ్ని వంటిది. అది శరీరమును, మనస్సును దహించి - శారీరక, మానసిక అనారోగ్య మునకు గురి చేస్తుంది. మీకు కోపముంటే అది మీకే నష్టము - మీరు జ్ఞానానికి దూరమైపోతారు. శాంతికి దూరమైపోతారు. మోక్షానికి దూరమైపోతారు.

srimammagaru.com

భగవంతుడికి దూరమైపోతారు. అందుచేత కోపాన్ని విడిచి పెట్టమని భగవంతుడు చెప్తున్నాడు.

కోరికకు మరో రూపమే కోపము. కోరిక నెరవేరకపోతే కోపము వస్తుంది. కోపమును తొలగించుకోకుండా అశ్రద్ధ చేస్తే భవిష్యత్తులో అనేక కష్టనష్టములకు గురికావలసి వస్తుంది. కోపము వలన ముఖము వికారమవుతుంది. హృదయము కుళ్ళిపోతుంది. కామ క్రోధములు అంటువ్యాధుల వంటివి. వాటిని మల మూత్రములతోను, చలి జ్వరముతోను పోల్చవచ్చును. కోపము వలన మనోనిగ్రహము సాధ్యపడదు. కోపమును మళ్ళించుకొనుటకు ఉపాసన, ప్రార్థన అవసరము.

ఎవరి సన్నిధానములో కూర్చుంటే మన కోపము చల్లారిపోతుందో, ఎవరి సన్నిధానములో కూర్చుంటే మన దేహాన్ని, ఇంద్రియాలను కూడా మర్చిపోతామో, ఎవరి సన్నిధానములో కూర్చుంటే ఈ రాగద్వేషాలు, కామ క్రోధాలు వాటి శక్తిని కోల్పోతామో - అటువంటి మహానుభావులను మనము ఆశ్రయించాలి.

గాఢనిద్రలో నుండగా మనకెవ్వరికీ కోపము లేదు - ఎందుచేత? కోపము కూడ ఒక తలంపే! గాఢ నిద్రలో గ్రహించటానికి విషయాలు లేవు. మరల మేలుకువరాగానే - "నేను" అను తలంపు ఉదయి

srimannagaru.com

స్తుంది. గ్రహించటానికి విషయాలు కనిపిస్తున్నాయి. ఇంద్రియాలతో వాటిని గ్రహించి మనస్సులోకి పంపిస్తున్నాము. మనస్సుకున్న పూర్వపు అలవాట్లను బట్టి కోపతాపాలకు గురి అవుతున్నాము.

చేప నీటిలో ఎదురీదినట్లు - మన మనో ప్రవాహానికి మనము ఎదురీది, దాని మూలమైన ఆత్మను సూక్ష్మబుద్ధిచేత గ్రహించాలి. ఆత్మ సుఖము చేతికి అందేవరకు ఏ జీవుడూ కోపతాపాల నుంచి బయట పడలేడు. కోపకారణము ఉన్నప్పటికీ ఎవరికైతే కోపము రాదో వాడి మనస్సు ఆత్మాకారము చెందు తుంది. అప్పుడు మనము కోపాన్ని జయించినట్లు.

చిన్న చిన్న పాత్రలు తొందరగా వేడెక్కుతాయి. అదే విధముగా చిన్న మనస్సులు గలవారు తొందరగా కోపానికి గురి అవుతారు. అల్పత్వము పెరిగి అనాగరిక జీవితానికి అలవాటు పడతారు. కోపము ఆరోగ్యానికి హాని చేస్తుంది. ఆర్థిక నష్టాన్ని తీసుకువస్తుంది. గౌరవాన్ని పాడుచేస్తుంది. సమాజములో అశాంతిని పెంచుతుంది. కోపమును త్యజించిన మనస్సు తనకు తాను మేలుచేసుకుంటుంది - మనస్సుకు స్వస్థత చేకూరుతుంది. స్వస్థత లేని మనస్సు ఆత్మను ధ్యానించ లేదు. కనుక అన్ని విధములా ప్రయత్నము చేసి కోపము

srimmagaru.com

నకు దూరము కావలెను.

కోపము వచ్చినప్పుడు మౌనమును అలవాటు చేసుకొనుట మంచిది. మౌనము యొక్క ప్రాముఖ్యత తెలిసిన వాడికి మాధవుడు దొరుకుతాడు.

## 13. త్యాగం :

మనము పనిచేసి ఫలితాన్ని సమాజమునకు సమర్పించుటయే త్యాగము. త్యాగము పవిత్రతను చేకూర్చిపెడుతుంది. పవిత్రుడికి ఈ లోకములో పొంద టానికి ఏముంది?

నరుని రూపములో నున్నవాడు కూడా నారాయ ణుడేనన్న భావనతో పనిచేయాలి. మనకు వచ్చే ఆదాయములో కొంత భాగమును సమాజ శ్రేయస్సు కోసము సమర్పించాలి. త్యాగము దేహ భావనను పోగొట్టి పరమాత్మలో తాదాత్మ్యము చేకూర్చుతుంది. త్యాగి ఏ ఇతర సహాయములు అక్కరలేకుండగనే స్వతంత్రముగా మోక్షమును పొందగలడు.

దుష్ట స్నేహములను, దురభ్యాసములను, దుర్వా సనలను సమూలముగా విడిచిపెట్టుట కూడా త్యాగమే! మనకున్న దానిని ఎదుటివారికి ఇచ్చుటయే త్యాగము

srimammagaru.com

కాదు - మనకు అవసరము లేని వస్తువులను ఎదుటి వారు ఇచ్చినా స్వీకరించకపోవుట కూడ త్యాగమే! మనకున్న దానిని ఎదుటివారికి ఇచ్చేటప్పుడు ఆడంబరము లేకుండా, ప్రచారము లేకుండా ఇస్తే పరమేశ్వరుని అనుగ్రహానికి పాత్రులౌతాము.

దేహవాసనను, లోకవాసనను త్యజించుట కూడా త్యాగమే! దానినే సన్యాసమని కూడా అంటారు. భోగదృష్టి కూడా లోకవాసనలో ఒక భాగమే.

మనకు జ్ఞానము కలుగకుండా అడ్డు వస్తున్న వ్యక్తులను, వస్తువులను విడిచి పెట్టుట కూడా త్యాగమే. దుస్సాంగత్యానికి దూరముగా వుంటే బ్రహ్మానుభవము పొందుటకు అర్హత చేకూరుతుంది. అహంకారమును త్యాగము చేస్తే బ్రహ్మానుభవము కలుగుతుంది. సర్వత్రా వ్యాపించియున్న బ్రహ్మము మన హృదయములో కూడా ఉంది. కానీ, మనకు బ్రహ్మానుభవము లేకపోవుట వలన బాహ్యంగా భగవంతుణ్ణి వెదకుటకు ప్రయత్నము చేస్తున్నాము. భేద భావనను సమూలముగా పెకలించకపోతే బ్రహ్మానుభవము కలుగదు.

దైవము కోసము, ధర్మము కోసము విభీషణుడు తన అన్నగారైన రావణాసురుణ్ణి విడిచిపెట్టాడు. నిర్వాణ స్థితిని పొందుటకు గౌతమబుద్ధుడు తన రాజ్యాన్ని

srimmamagaru.com

త్యాగం చేసి, ఏకాంతవాసానికి వెళ్ళాడు. అనేక మంది మహానుభావులు దైవము కోసము సామాన్య ధర్మము లను పరిత్యజించారు. సత్యాన్వేషణ ప్రారంభించే వరకు అజ్ఞాన నాశనము ఆరంభము కాదు. వైరాగ్యము లేని తపస్సు వలన బ్రహ్మానుభవము కలుగదు.

ప్రతిఫలాన్ని ఆపేక్షించి చేసే పని త్యాగము కాదు. అది వ్యాపారమౌతుంది. క్రయ విక్రయాలకు అలవాటు పడిన మనుష్యులకు త్యాగము గురించి ఏమి తెలు స్తుంది? స్వార్థమే పరమార్థముగా పెట్టుకొని జీవించే వాడికి భక్తిరుచి ఏమి తెలుస్తుంది? ఇంద్రియ విలాస మును నిరోధించిన వాడే నిజమైన త్యాగి. త్యాగి నిరంతరమూ బ్రహ్మానందములో మునిగి ఉంటాడు.

## 14. శాంతి :

జీవితములో కష్టసుఖాలు, లాభనష్టాలు సంభ వించినప్పటికీ శాంత చిత్తమును పోగొట్టుకోకూడదు - నిర్వికారముగా ఉండగలగాలి.

మనస్సు అణిగి వున్నప్పుడు కూడా మనకు శాంతిగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ, ఎవరైనా మనకు ఇష్టములేని మాట అన్నప్పుడు, కష్టము కలిగించే పని చేసినప్పుడు - చెరువులో చిన్నరాయి విసిరితే కెరటాలు

srimmagaru.com

వచ్చినట్లు - వెంటనే మన మనస్సులో వికారము పుడుతుంది, కోపము వస్తుంది, శాంతి పోతుంది. జీవితములో ఒడిదుడుకులు వచ్చినప్పటికీ - ఒడిదుడుకులు రాకముందు ఉన్న స్థితిలో ఉండగలగాలి. మనస్సు విజృంభిస్తున్నంత కాలమూ ఏ మనిషీ శాంతిగా వుండ లేడు. మనో నాశనమైనప్పుడు మాత్రమే శాశ్వతశాంతి చేకూరుతుంది.

మన మందరమూ శాంతినే కోరుకుంటున్నాము - అశాంతిగా మాత్రం ఎందుకు ఉండకూడదు? మన స్వరూపమైన ఆత్మ - శాంతి స్వరూపము, సుఖ స్వరూపము, ఆనంద స్వరూపము. శాంతి అనేది ఆత్మ యొక్క స్వరూపమేగాని - ఆత్మ యొక్క గుణము కాదు. గుణము అనేది మనస్సు యొక్క పరిధిలోనిది. మనకు తెలియకుండానే మన స్వరూప సుఖాన్ని మనము కోరుకుంటున్నాము.

ఆత్మ విచారణ వలన మనస్సుకు ఉపశమనము కలుగుతుంది. నిరంతరము ఆత్మను ధ్యానము చేయుటవలన మనస్సులో నున్న లోపములు రాలి పోయి శాంతి చేకూరుతుంది. జీవితము నిగ్రహ పరీక్ష లాంటిది. మనో నిగ్రహము లేనివాడు చిత్త శాంతిని సాధించలేడు. శాంతిలేని జీవితము వ్యర్థము. శాంతి

srimammagaru.com

లేనివాడు పాపముతో పోరాడలేడు. పాపమే అశాంతి రూపములో వస్తున్నది. అసత్యము నుంచి ఎవరైతే విడుదల పొందుతున్నారో - వారు మాత్రమే శాంతి స్వరూపులౌతారు.

ఆత్మ విచారణ శాంతినిస్తుంది - లోకవిచారణ అశాంతినిస్తుంది.

## 15. అపైశునమ్ :

ఇతరుల దోషములను వెల్లడి చేయకుండుటను అపైశునమ్ అంటారు. కొండెములు చెప్పే దురలవాటు ఉన్నవాడికి భక్తి భావన కుదరదు, తోటివారికి ఉపయోగడపలేడు. ఈ లోపమును సాధన చేసి తొలగించుకోలేకపోతే విపరీతమైన కష్టనష్టములకు గురికావలసి వస్తుంది. భగవంతుడిని గురించి స్మరణ చేస్తే అంతఃకరణము శుద్ధి అవుతుంది - ఎదుటివారి లోపములను వెదకుతుంటే అంతఃకరణము మలినమౌతుంది.

సాటి మనిషిలో లోపాలను చూస్తున్న మీరు ఎంత వరకూ పవిత్రులు? మీలోను - ఎదుటివారిలోను ఈశ్వరుడు సమానముగానే ఉన్నాడు. ఎదుటివారిలో ఏ బలహీనత మనకు కనిపిస్తున్నదో - దానికి సంబంధించిన సంస్కారము మనకు కూడ తెలియ

srimmagaru.com

కుండా మనలో కూడా దాగివుంది. మన ముఖములో లేని అందము మన ప్రతిబింబములో కనబడదు. అదే విధముగా మీరు పవిత్రులు కానప్పుడు లోకములో కూడా మీకు పవిత్రత కనపడదు. కనుక రంధ్రాన్వేషణ విడిచిపెట్టి మీరు పవిత్రులగుట కోసము ప్రయత్నించండి. సంస్కరణను మీ దగ్గర నుంచే ప్రారంభించండి. మిమ్ములను మీరు సంస్కరించుకొని - మీరు ఎదుటి వారిని సంస్కరించండి. వారిని బలవంతులుగా తీర్చి దిద్దండి. విమర్శ కంటే సంస్కరణ మంచిది. కూల్చుట కంటే నిర్మించుట మంచిది. మిమ్మల్ని మీరు సంస్కరిం చుకొనకుండా మీరు లోకమును సంస్కరించలేరు. మీరు ఎంతవరకూ ఉన్నతులో, ఎంత వరకూ పవిత్రులో - అంతవరకూ మాత్రమే సాటి సమాజానికి మీరు ఉపయోగపడగలరు.

మంచిని చూస్తూ, మంచిని చేస్తూ, మంచిని మాట్లాడుతూ, మంచిని స్మరిస్తూ, మంచిని జపిస్తూ , మంచిని పూజిస్తూ, మంచిని ధ్యానిస్తూ, మంచిని సేవిస్తూ మీలోనున్న అపవిత్రతను తొలగించుకొనుటకు నిండు మనస్సుతో పనిచేయండి. సహజంగా జీవించుట కంటే ఉదాత్తమైన సంస్కరణ లేదు. మీ దేహమును చంపగలరు గాని - మీలోనున్న పవిత్రతను

srimmagaru.com

ఎవరు చంపగలరు?

సత్పురుషుణ్ణి గౌరవించేవాళ్ళు అతని పుణ్యానికి వారసులౌతారు - అగౌరవపరచేవాళ్ళు అతని ప్రారబ్ధ ములో నున్న పాపాన్ని పంచుకుంటారు. కృత్రిమ జీవితము వలన మానవుడు ఆరోజుకారోజు అపవిత్రుడై చీకటి లోకాలలో పడతాడు.

"చాకలి వాడికి బట్టలమీద కోపముగాని, ద్వేష ముగాని ఉండదు. వాటిని శుద్ధిచేయుటకు మాత్రమే రాతిమీద ఉతుకుతున్నాడు. అదేవిధముగా భగవంతు డు బాధల రూపములో వచ్చి భక్తుని హృదయములో నున్న లోపములను బయటికి లాగి కాలుస్తాడు" అన్నా రు అరుణాచలములో నివసించిన 'గుహానమశ్శి వాయ' అనే సిద్ధపురుషుడు.

మీకు శాంతి కావాలంటే కొండెములు చెప్పే అలవాటును విడిచిపెట్టండి.

# 16. దయా భూతేషు :

అంటే అన్ని ప్రాణులయందు దయ కలిగి ఉండ వలెను. దయ దైవీగుణము. దయగల హృదయమే భగవంతుని నిలయమని మహర్షి శ్రీ మళయాళ

srimammagaru.com

స్వామివారు అనేవారు.

దయాగుణము వలన పాపము తగ్గుతుంది - జ్ఞానము కలుగుతుంది. గౌతమబుద్ధుడు దయకు ప్రతి రూపము. సంకుచిత హృదయులకు దయ యొక్క ఔన్నత్యము అర్థముకాదు. దయ అనే గుణము వలన మానవుడు తన చైతన్యస్థాయిని పెంచుకోగలడు. సాటి ప్రాణులపట్ల మనము దయ చూపిస్తే - మనపట్ల దేవుడు దయ చూపిస్తాడు. దయగలవారే ధన్యులు ఈ లోకంలో!

భగవంతునిపట్ల మనకున్న ప్రేమను 'భక్తి' అంటారు. దీనులపట్ల, పేదలపట్ల మనకున్న ప్రేమను 'దయ' అంటారు. దయ ప్రతిఫలాన్ని కోరదు. దయా గుణము మనస్సును సంస్కరించి మహోన్నతమైన ఆధ్యాత్మిక శిఖరాన్ని అందుకొనుటకు సహాయ సహ కారములను అందిస్తుంది. దయామయుడు భగవం తునితో వ్యాపారము చేయడు. దయాపరుడు తోటి మానవులను గూర్చి ఆలోచిస్తూ తనను తాను మరచి పోయి అవసరమైతే వారికోసము మరణిస్తాడు. దయ గలవాడు మాత్రమే సామాజిక స్పృహతో పనిచేస్తాడు. స్వార్థమే పరమార్థముగా పెట్టుకున్న వాడికి దయ విలువ తెలియదు. నిరంతరము తనను గురించి

srinannagaru.com

మాత్రమే ఆలోచించుకునే వాడి హృదయములో దయ పూర్తిగా ఎండిపోతుంది.

"దీనులను చూసి ఎవరి హృదయమైతే ద్రవిస్తుందో వారు మాత్రమే మహాత్ములు" అన్నారు స్వామి వివేకానంద.

అన్ని రసములలోను కరుణారసమునకు అగ్రస్థానము ఇవ్వవచ్చును. యజ్ఞ భావనతో పనిచేస్తే దయాగుణము పెరుగుతుంది.

## 17. అలోలత్వం :

విషయములు అందుబాటులో ఉన్నప్పటికీ చాపల్యము లేకుండా ఉండుటయే అలోలత్వము.

మనస్సుకు వికాసము కలగాలంటే, ఇంద్రియాలు నిర్వికార స్థితిని సాధించాలంటే - అలోలత్వాన్ని అభ్యసించాలి. ఇంద్రియములను స్వాధీనము చేసుకొనుటకు, మనస్సును నిగ్రహించుకొనుటకు ప్రయత్నము అవసరము. మోక్షము మన హృదయములోనేఉంది - మోహము పోతే అది తెలుస్తుంది. బాహ్య విషయముల నుండి వస్తువుల నుండి ఆకర్షణల నుండి మళ్ళించ బడిన మనస్సు మాత్రమే జ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చేస్తుంది. శీలము లేకుండా

srinannagaru.com

లోలత్వమును అతిక్రమించలేము. శీలాన్ని పెంచే విద్య మాత్రమే నిజమైన విద్య.

పరమాత్మ అంతటా వ్యాపించి ఉంది. అయితే దానిని మనమెందుకు దర్శించలేకపోతున్నాము? దానికి చాపల్యమే కారణం! చాపల్యమున్నంత కాలమూ మనము ఉన్న దానిని ఉన్నట్లుగా చూడలేము. పరమాత్మను మనస్సు పరిధిలోగాని, ఇంద్రియముల పరిధిలోగాని ఇమడ్చలేము. స్వరూప దర్శనము అయ్యే వరకు మనల్ని లోలత్వము విడిచిపెట్టదు. పవిత్రుడు లోలత్వమునకు దూరమౌతాడు - మృత్యువును దాటి పోతాడు. కాని విషయలోలుడు చావుచేతిలో నుంచి బయటపడలేడు. విషయచింతన ఉన్నంత కాలము అజ్ఞానము మానవుణ్ణి చుట్టుకొని ఉంటుంది. నిర్వి కారంగా ఉండుటకు సమాధిస్థితిని పొందాలి.

లోలత్వము నుంచి బయటపడటానికి - సజ్జన సాంగత్యము చేయాలి, శాస్త్రాన్ని శ్రవణము చేయాలి, జపము చేయాలి, ధ్యానము చేయాలి, ఆత్మ చింతన చేయాలి. మనస్సును మచ్చిక చేసుకొని విషయముల నుండి మరల్చి - ఆత్మ వైపునకు గురి పెట్టాలి. ఆత్మను దర్శించే వరకూ మనస్సు చలిస్తూనే ఉంటుంది.

శ్రీకృష్ణ చైతన్యుని ఇంద్రియ నిగ్రహము పరీక్షిం

srimannagaru.com

చుటకు అతని గురువు చైతన్యుని నాలుక మీద పంచ దారను వేస్తే - ఒక్క అణువు కూడ తడికాలేదట! అదీ ఇంద్రియ నిగ్రహమునకు నిదర్శనము. భక్తి సహాయము లేకుండా ఇంద్రియములను జయించలేము.

# 18. మార్దవం :

మార్దవం అంటే మృదుత్వము. మృదుత్వము - క్రూరత్వము ఇవి రెండూ ఒకే చోట ఉండవు. కొంత మందికి మృదుత్వము, స్వార్థంతో పాటు క్రూరత్వము కూడా ఉంటుంది - ఈ రెండూ వున్నవాడి బుద్ధి వంకర అవుతుంది.

మృదుత్వము లేనివాడు ముని కాలేడు. మనస్సు లోపలికి దిగుటకు మృదుత్వము అవసరము. లోపలికి వెళ్ళిన మనస్సుకు మాత్రమే చైతన్యము వైపు దారి కని పిస్తుంది. కాల్చిన బంగారానికి కాంతి ఎలా పెరుగు తుందో - మృదుత్వమున్న వాడికి మంచితనము అలా పెరుగుతుంది. "మంచి తనమే జ్ఞానము" అన్నాడు సోక్రటీస్!

ప్రియముగా, హితముగా మాటలాడుట అల వాటు చేసుకోవాలి. ఎప్పుడు, ఎక్కడ, ఎవరితోటి, ఎంత వరకూ ఎలా మాటలాడాలో అంతవరకు మాత్రమే

srimamagaru.com

మాటలాడాలి. సభ్యత, సంస్కారము, సంస్కృతి, నాగరికత మృదుత్వము మీద ఆధారపడి ఉన్నాయి. మృదుత్వము జీవితానికి నమ్రత్వాన్ని తీసుకువస్తుంది. హృదయము యొక్క లోతును పెంచుతుంది. మనస్సుకు చల్లదనాన్నిస్తుంది. సమాజములో శాంతిని, శక్తిని స్థాపించుటకు ఉపయోగపడుతుంది. మనిషికి, మనిషికి మధ్యన అవగాహనను పెంచుతుంది. పరిస్థితులు కఠినముగా ఉన్నప్పటికీ మృదుత్వమును కోల్పోకూడదు.

సాధకుడికి మృదుత్వము అవసరము. మృదుత్వము ఈశ్వరానుగ్రహమును సంపాదించి పెడుతుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందుటకు ప్రతిభ కంటే ఈశ్వరానుగ్రహము చాలా ముఖ్యము. మృదుత్వమం ఎలా వుంటుందో సజ్జనుడి హృదయములో చూడవచ్చును. దుష్టుని యొక్క ప్రభావము మీద పడనిస్తే - మృదుత్వము తరుగుతుంది. తోటి మానవుల కష్టాలలో, బాధలలో భాగము పంచుకుంటున్నప్పుడు కూడా మృదుత్వమును కోల్పోని జీవుడు - శివుడుగాను, శుకుడుగాను అవుతాడు.

లోకమునకు తెలిసినా తెలియకపోయినా మృదుత్వమున్న మనిషి ఉత్తమ మానవుడిగా తీర్చి దిద్దబడతాడు. మృదుత్వము ధీరుని లక్షణమేగాని -

srinannagaru.com

భీరుని లక్షణముగాదు. మనస్సులో కాలిన్యమున్న మని షి జీవితము యొక్క పై భాగమును మాత్రమే చూడగల డు గాని - జీవితపు యొక్క లోతులను చూడలేడు.

ఆత్మ విద్యకు మృదుత్వము అత్యంత ముఖ్యము. మానవుడు చేసిన పోరాటములు, సాధించిన విజయ ములు ఆత్మ విద్యతో పోల్చుటకు సరిపోవు. ఆత్మ వైభవ ముతో పోల్చుటకు జీవితం ఏపాటిది?

## 19. హ్రీః :

హ్రీః అంటే సిగ్గు. చేయరాని పనులు చేయుట కు సిగ్గుపడాలి. చెడుపనుల వలన, చెడు తలంపుల వలన మానవుడు శారీరకముగా, మానసికముగా, నైతికముగా పతనమౌతాడు - మూలములో నాశన మౌతాడు. ఆత్మ కేంద్రము మన హృదయములో నున్న ప్పటికీ కుతంత్రముల వలన అది గోచరించుటలేదు. అన్ని విధములా ప్రయత్నము చేసి ఆత్మ పదవిని అందు కోలేకపోతే మానవుడు అమృతస్థితిని పొందలేడు.

శరీరము, మనస్సు, బుద్ధి - ఇవన్నీ గుల్లలు. సాక్షి మాత్రమే వాటిని చైతన్యముతో నింపుతున్నది. సాక్షి రూపములో ప్రకాశిస్తున్న బ్రహ్మమును అనుభవములో నికి తెలచ్చుకొనుటకు మన ఆవేశములను అదుపులో

srimammagaru.com

పెట్టుకోవాలి. గాలిమేడలు కట్టకూడదు. నిషిద్ధ కర్మలు ఆచరిస్తే ఈశ్వరానుగ్రహానికి దూరమవౌతాము. జపము సరళముగా సాగదు. ధ్యానాభివృద్ధి కుదరదు. దుర్వ్యా సనలను విడిచి పెట్టుటకు - ఈశ్వర భక్తి ప్రాణాయామ ము, ఆత్మ విచారణ అవసరము.

సిగ్గుపడవలసిన పనులు చేయకుండా జాగ్రత్త పడాలి. చేసిన చెడు పనుల యొక్క ప్రభావము అను భవములోనికి వచ్చినప్పుడు మాత్రమే తెలుస్తుంది. మంచి చేసిన వాడికి సద్గతి - చెడు చేసిన వాడికి దుర్గతి తప్పదు. ఇది ప్రకృతి నియమం! పూర్వ జన్మ లలో జీవుడు చేసిన చెడ్డ పనులే ఈ జన్మలో దుష్ట సంస్కారములుగా వ్యక్తమవుతున్నవి. దుష్ట కర్మ ప్రారంభములో ప్రీతిగా ఉన్నప్పటికీ పరిణామములో దుఃఖమును తీసుకువస్తుంది. కట్టెలతో పనిలేకుండానే చింత శరీరమును దహించి వేస్తుంది. కుచింతలే భవిష్యత్తులో వికృత రూపాలు ధరిస్తాయి. అంతస్తుకు తగని పనిని చేయకూడదు.

కొంతమంది మతాన్ని, భక్తిని ఆసరాగా చేసుకొని సమాజములోని అసమానతలకు, అశాంతికి కారణ మవౌతున్నారు. జీవుడు తాను చేసిన కుచేష్టల ఫలితము నుండి తాత్కాలికముగా తప్పించుకున్నప్పటికీ దేహాంతర

srinannagaru.com

ములలో, లోకాంతరములలో అనుభవించక తప్పదు. అప్పటి వరకు వాటిని ప్రకృతి తన గర్భములో దాచి ఉంచుతుంది. జీవితము యొక్క అస్థిత్వమును గౌరవించేవాడు లోకమునకు క్షోభను కలుగజేయడు. పరమాత్మ పవిత్రులకు పవిత్రుడు. పరమాత్మ ప్రీతికొరకు పనులు చేసి పరమాత్మలో ఐక్యభావనను పొందాలి - అదే జీవిత గమ్యం! మంచిని పెంచుకుంటే చెడుకు దూరమౌతాము - జీవితములో అపహాస్యము పొందనక్కరలేదు. దైవము పట్ల దీర్ఘ శరణాగతి గనుక కలిగి ఉంటే దుష్టముమీద విజయమును సాధించవచ్చును.

## ౨౦. అచాపలం :

మనస్సుతోగాని, ఇంద్రియములతోగాని అవసరములేని పనులు చేయకుండుటను అచాపల్యమని అంటారు.

నరుడు నారాయణుడగుటకు, జీవస్థితి నుండి శివస్థితిని పొందుటకు అచాపల్యము అవసరము. చాపల్య మున్నంత కాలము మానవుడు సామాన్య స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదగలేడు. చాపల్యమునకు లోనై దేవతలు కూడా శపించబడ్డారు.

అచాపల్యము శాంతిని, విశ్రాంతిని, ప్రేమను,

srimmagaru.com

దయను పెంచుతుంది. చపలత్వమున్న చోట వ్యర్థ మైన చింతలు, వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన పనులు గూడుకట్టుకుంటాయి. క్రమశిక్షణ కొరవడుతుంది. చపలత్వమున్న మనిషి సాటి మనిషిని ప్రేమించలేడు. కనిపిస్తున్న మనుష్యులను ప్రేమించలేనివాడు కనిపిం చని దేవుణ్ణి ఎలా ప్రేమించగలడు?

అన్ని ఇంద్రియములను స్వాధీనము చేసుకున్న వాడు మాత్రమే అచాపల్యస్థితిని అందుకుంటాడు. అచాపల్యము ఆర్థికాభివృద్ధిని సాధించలేకపోయినా - శాంతి సామ్రాజ్యమును స్థాపించుటకు సహాయపడు తుంది. భువినుండి దివికి వెళ్ళుటకు వంతెనగా ఉప యోగపడుతుంది. పూజలు, జపాలు అచాపల్య స్థితిని పొందుటకు సహాయపడునేగాని -అవి జీవిత గమ్యము కాదు. మనస్సును శుద్ధిచేసుకొనుటకు జీవితము పొడుగునా పోరాటము సాగించాలి. పూర్వ జన్మలకు, ఈ జన్మకు సంబంధముంటుంది. అనేక జన్మల కృషి ఫలితంగా సంస్కారమేర్పడుతుంది. సంస్కారము సహాయముతో మనోనిగ్రహమును సాధించవచ్చును. గర్వమున్న మనిషికి నిగ్రహము సాధ్యముకాదు. నిగ్రహ ము లేనివాడు కామక్రోధముల యొక్క వేగమును తట్టుకోలేడు. సజ్జనులతో సాంగత్యముచేసి సంస్కార

srimannagaru.com

మును పెంచుకుంటే మనోమూలము తెలియబడు తుంది.

పాపము, అహంకారము - ఈ రెండూ చిత్త చాపల్యమునకు కారణములు. చిత్త శుద్ధి కలిగితే చిత్త చాపల్యము ఉండదు. బాహ్య పరిస్థితుల వత్తిడికి పవిత్ర హృదయము లొంగదు, హెచ్చు తగ్గులకు లోనుకాదు. యోగాభ్యాసము వలన చాపల్యము నశిస్తుంది. చపలత్వము లేనివాడికి ఈ లోకములో పొందతగిన దేముంది? మనస్సులోనున్న దోషములు బయటికి పోకుండా మనిషికైవల్యమును పొందలేడు. నిశ్చల మనస్సు మాత్రమే స్వరూపమును పొందుతుంది - దుఃఖమును హరిస్తుంది.

మనస్సును బాగుచేసుకొనుటకు మతము అవసరము. అందువలన మనిషికి మతముతో నున్న సంబంధమును తెంపకూడదు. మతములోని అప్రధాన విషయములను విడిచిపెట్టి, మతసారమైన ఆత్మ విద్యను అలవర్చుకోవాలి. కొన్ని దేశాల ప్రజలకు వ్యాపార మంటే మక్కువ - కాని మన దేశ ప్రజల మీద మత ప్రభావము ఎక్కువ. భగవంతుడు మనికిచ్చిన అవకాశ ములను దుర్వినియోగము చేయకూడదు. వచ్చిన అవకాశమును సద్వినియోగము చేసుకొనుట వివేక

srimammagaru.com

వంతుని లక్షణము.

ధర్మమును ఆచరిస్తే మనస్సు చల్లబడుతుంది. ఆనంద పదవి అందుతుంది. సత్యాన్వేషణయే మనస్సు యొక్క పనిగా ఉండాలి. మనోవికాసము పొందుటకు స్వల్ప సంతోషములకు లోనుకాకూడదు. తర్కము వలన మనస్సు లొంగదు. అనుదినము మనస్సుకు క్లీనింగు అవసరము. మనస్సులోనున్న లోపాలే మనస్సుకు పుండ్లు. వాటిని భక్తి అనే జలముతో కడిగి, శుభ్రము చేసి మనస్సును జ్ఞాన సముపార్జనకు సమర్థ వంతముగా తయారు చేయాలి. నిజమును చూసిన మనస్సుకు చపలత్వముండదు.

"నా మనస్సును కదలమంటే కదులుట లేదు" అన్నారు ఒక సందర్భములో శ్రీరమణేశ్వరుడు. అచాప లమే అదృష్టము.

## 21. తేజః :

అంటే తెలివి, తేజస్సు, ప్రతిభ, ప్రజ్ఞ, ప్రకాశము, బుద్ధి సూక్ష్మత!

ఒక విషయాన్ని తొందరగా అర్థము చేసుకునే శక్తి గనుక ఉంటే - అదే బుద్ధి సూక్ష్మత. కష్టము తన

srinannagaru.com

వరకు వస్తే ఎవరికైనా తెలుస్తుంది. కానీ ఎదుటి వారికి ఎవరికైనా కష్టము వస్తే - వారికి ఆ కష్టము ఎందుకు వచ్చినదో తెలుసుకొని, ఆ పనిని మనము చేయకుండా ఉండగలిగితే - అదీ బుద్ధి సూక్ష్మత.

ఎదుటివారు మిమ్మల్ని అవమానపరచటానికి ప్రయత్నించినప్పటికీ - మీలో వికారము కలుగకపోతే - మీరు ప్రతిభావంతులు. ఒకవేళ ఎదుటివారు మిమ్మల్ని పొగిడితే - ఆ పొగడ్తలకు గనుక మీరు లొంగిపోతే మీరు ప్రతిభావంతులు కాదు. అసత్యానికి లొంగిపోయే వాడు ప్రతిభావంతుడు ఎలా అవుతాడు? సమాజ పరిస్థితులు మారవచ్చును. దేశకాలమాన పరిస్థితులు మారవచ్చును. ఆర్థిక పరిస్థితులు మారవచ్చును. కానీ ప్రకృతి చూపే ప్రలోభాలకు గనుక మీరు లొంగిపోతే మీరు ప్రతిభావంతులు కాదు. ప్రకృతి ప్రలోభాలకు మీరు లొంగిపోతున్నంతకాలము మీ ప్రాణశక్తి ఖర్చై మీ తేజస్సు క్షీణిస్తుంది.

వాల్మీకి మహర్షి రామాయణములో ఒక మాట చెప్పాడు - "ఇంటిలో డబ్బులు ఎక్కువగా వున్నా, ఇంటిలో ఏదైనా కష్టము వచ్చినా, ఎప్పుడైనా ఏదైనా ప్రమాదములో చిక్కుకున్నా - మనస్సును నిగ్రహించుకొనుట ఎంతటి వారికైనా కష్టము" అని చెప్పాడు. కష్ట

srimannagaru.com

మని చెప్పాడేగాని అసాధ్యమని మాత్రము చెప్పలేదు. మనోనిగ్రహము లేకుండా సూక్ష్మబుద్ధిని పెంచుకోలేము.

ప్రతిభావంతులు, కష్టజీవులు మాత్రమే దేశానికి నిజమైన సంపద. సమాజములోని దోషములను తొలగించుటకు ప్రతిభావంతుల కృషి అవసరము. ప్రతిభ ఎక్కడ వున్నా, ఏ రూపములో వున్నా దానిని గుర్తించటానికి కూడా ప్రతిభ అవసరము. నాగరికత అభివృద్ధికి ప్రతిభ అవసరము. సాంఘిక, విద్యా, వైద్య, ఆర్థిక, వ్యవసాయ, రాజకీయ రంగములలో ప్రతిభావంతులు ఎంతగానో కృషి చేస్తున్నారు. ప్రతిభ ఎక్కడ కనిపించినా దానిని ప్రోత్సహించుట అవసరము.

క్రమశిక్షణ, సత్ప్రవర్తన - ఇవి రెండూ ప్రతిభను నడిపితే అది ఉజ్వలముగా ప్రకాశిస్తుంది. ఎంత సంపద ఉన్నప్పటికీ తెలివి గనుక లేకపోతే బ్రతుకుకూడా కష్టమే. ప్రతిభావంతులు, పవిత్రులు మాత్రమే మానవజాతికి నాయకత్వము వహించి, ప్రపంచ చరిత్రను సృష్టించారు - సమాజానికి వెలుగును చూపించారు.

సత్యాన్వేషణకు ప్రతిభ అత్యంత ముఖ్యము. స్వరూపము సూక్ష్మబుద్ధికి మాత్రమే అందుతుంది గానీ స్థూల బుద్ధికి అందదు. సూక్ష్మబుద్ధి సహాయముతో

srimmagaru.com

కామక్రోధములను తొలగించుకుంటే జీవుడు జ్ఞాని అవుతాడు. బుద్ధి వికాసమునకు తోడ్పడే వాతావరణ ము మానవుడు కల్పించుకోవాలి. సజ్జనులతో సహవాసము చేసి సభ్యతను పెంచుకుంటే బుద్ధి శుద్ధమై చైతన్యముతో లయమౌతుంది. ప్రేమతో పనిచేస్తే ప్రతిభ పెరుగుతుంది. ప్రతిభ లేకపోతే ప్రగతి ఆగి పోతుంది.

## 22. క్షమః :

అంటే - ఓర్పు, సహనము! ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ మనస్సులో వికారము లేకుండా సమానముగా ఉండగలిగితే - అదే క్షమ.

జీవితములో ఓర్పు చాలా ముఖ్యము. ఓర్పు గలవాడు మాత్రమే జయాపజయములను సమానము గా స్వీకరించగలడు. ఓర్పుతో చేసే పని ధ్యానముతో సమానము. ఓర్పు మాత్రమే కామక్రోధములను కాల్చి బూడిద చేయగలదు. దేహప్రారబ్ధమును ఓర్పుతో సహించే వాడికి కొత్త వాసనలు పుట్టవు - శరణాగతి అలవడుతుంది - హృదయము యొక్క లోయలలోనికి దిగగలుగుతాడు. నీరు పల్లమునకు ప్రవహించునట్లు - ఓర్పుగలవాడినే సత్యము వరిస్తుంది.

srimmagaru.com

పంచభూతములలో భూమిని క్షమాగుణముతో పోలుస్తారు. అవతారములలో శ్రీరామావతారము క్షమాగుణానికి ప్రతీక.

శారదామాత శరీరము విడిచిపెట్టే ముందు మాకు మంచి మాటలు చెప్పమని శారదానంద అడిగితే "సహనం, సహనం, సహనం" అని ఒకే మాటను మూడుసార్లు చెప్పినది. ఆధ్యాత్మిక మార్గము లో పయనించే వాడికి సహనము ఎంత ముఖ్యమో ఆమె మాటలలో మనకు అర్థమౌతున్నది.

క్షమలేనివాడు అజ్ఞానమును అలంకరిస్తాడు. క్షమ గలవాడు సమాజమును అలంకరిస్తాడు. క్షమ లేని జీవి, క్షమలేని జాతి నశించిపోతుంది.

## 23. ధృతి :

అంటే ధైర్యము. ధైర్యము లేనివాడికి దైవ సాక్షాత్కారము కలుగదు. ధైర్యములేనివాడు దేహబుద్ధిని విడిచి పెట్టలేడు.

శారీరక ఆరోగ్యమునకు, మానసిక ఆరోగ్యమునకు ధైర్యము అవసరము. పరిస్థితులు అనుకూలము గా నున్నా - ప్రతికూలముగా నున్నా ధైర్యవంతుడు ఎప్పుడు ఎక్కడ ఏ పని చేయాలో అప్పుడు అక్కడ ఆ

srimannagaru.com

పని చేస్తూనే ఉంటాడు. చింతాకంత చింతకూడా లేకుండా జీవనయాత్ర సాగిస్తాడు.

ధైర్యము జ్ఞాపకశక్తిని, మేధాశక్తిని అభివృద్ధి చేస్తుంది. ధైర్యము ఆభరణము వంటిది. అది అనుకరణకు అంగీకరించదు.

ధైర్యములేకుండా స్వేచ్ఛామండలములోనికి ఏ మానవుడూ ప్రవేశించలేడు. ధైర్యము కొరవడిన మానవుడు సత్యాన్వేషకుడు కాలేడు - హృదయ దౌర్బల్యము నుండి బయటపడలేడు. ధైర్యములేని వ్యక్తికి, జాతికి పురోగమనము ఆగిపోతుంది. ప్రపంచంలో నున్న సంపద ధైర్యవంతుడికే సొంతమౌతుంది. ధైర్యమే లక్ష్మి!

"ధైర్యమే అన్ని రోగములకూ ఔషధము వంటిది" అన్నాడు భారతంలో భీష్మాచార్యులు.

## 24. శౌచం :

అంటే శుచి, శుభ్రత! బాహ్యములో శుచి ఎంత అవసరమో - అంతరంగములో కూడా శుచి అంతే అవసరము. ప్రతీ వ్యక్తికి రెండు దేహములున్నవి. ఒకటి స్థూల దేహము, రెండు సూక్ష్మదేహము. స్థూలదేహములో నున్న దోషములు దేహము కాలినప్పుడు కాలిపోతాయి. కానీ, సూక్ష్మదేహమైన మనస్సులోనున్న దోషము

srimmamgaru.com

లు మరుజన్మకు కూడా వెంట వస్తాయి.

శుచి లేకుండా మానసిక ఆరోగ్యము సాధ్య పడదు. మనస్సు యొక్క స్వరూపము తెలియనివాడు, దానిని వశము చేసుకోలేనివాడు తనను తాను ఉద్ధ రించుకోలేడు. శుచిలేనివాడికి ఆధ్యాత్మిక స్పందన కలుగదు. వాడు అహంకారము నుండి విడుదల పొందలేడు. ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము గలవాడు మాత్రమే పరిశుద్ధుడౌతాడు - పరమాత్మను దర్శిస్తాడు.

మనము పొట్ట విషయములో జాగ్రత్త పడుతు న్నాము గానీ - బుద్ధి విషయములో శ్రద్ధ తీసుకొనుట లేదు. బుద్ధిని శుద్ధి చేసుకొనకపోతే జ్ఞానము దిశలో ఎదగలేము. సత్త్వశుద్ధి, ద్రవ్యశుద్ధి - ఇవి రెండూ లేకుండా దైవ సాక్షాత్కారము కలుగదు. శుచిలేకపోతే మనోనిగ్రహము సాధ్యముకాదు. ఈనాటికైనా ఏనాటి కైనా శుచిలేని వాడు ప్రకృతి బంధము నుండి విడుదల పొందలేడు.

భగవంతుడు చెప్పినట్లు నడుచుకుంటే దేహగత మైన శుచి, భగవంతుణ్ణి ధ్యానము చేస్తే మనోగతమైన శుచి లభ్యమౌతాయి. శుచిగల వాడికి అందరి హృద యములలోను ప్రకాశిస్తున్న పరమాత్మ కనిపిస్తాడే

srimammagaru.com

ఉంటాడు. వాడు పంచభూతములలో కూడ పరమాత్మ
ను దర్శించగలడు. శుచిలేనివాడికి గతిలేదు.

## 25. అద్రోహః :

పరులకు ద్రోహము చేయకుండుట అద్రోహము. ఎదుటివారు మిమ్ము ద్వేషించినప్పటికీ, దూషించినప్పటికీ, మీకు అపకారము చేసినప్పటికీ - మీరు తిరిగి ప్రతీకారము చేయగల శక్తి మీకు ఉన్నప్పటికీ - మీరు అపకారము చేయకూడదు - ద్రోహము తలపెట్టకూడదు. ద్రోహము తెలివికాదు. తెలివి స్పష్టంగా, సరళంగా, సూక్ష్మంగా, దృఢంగా ఉంటుంది.

ద్రోహ చింతన ఉన్నవాడు పనిచేయకుండా ఫలితాన్ని అనుభవించాలని అనుకుంటాడు. వాడికి కృతజ్ఞత యొక్క స్వరూపము కూడా తెలియదు. అట్టివారి స్నేహములు చిరకాలము నిలబడవు. ప్రతీ ద్రోహి సమాజములో వున్న కుళ్ళును పెంచుటకు సహకరిస్తాడు.

ద్రోహచింతన సమాజములో ఉపద్రవాన్ని తెస్తుంది - అశాంతిని, అసుఖమును, అజ్ఞానమును పెంచుతుంది. సమాజానికి చేయగలిగితే మంచిని చేయాలి - మంచి చేయలేకపోతే కనీసము మంచి జరుగుతుంటే చూసి సంతోషించాలి. దాని వలన

srinannagaru.com

కూడా పుణ్యము వస్తుంది. మంచి కార్యమును చెడ గొట్టితే అది ద్రోహము. దానివలన పాపము వస్తుంది.

ద్రోహచింతన సాధకుడికి తగదు. ద్రోహచింతన ఉన్నవాడి మనస్సు మలినమైపోతుంది. వాడికి ధ్యానము కుదరదు - వివేకము పెరగదు. శాశ్వతమైన ఆత్మ జ్ఞానమును సముపార్జించుటకు కావలసిన సామగ్రిని సమకూర్చుకొనుటకు ద్రోహచింతన అడ్డు పడుతుంది. ద్రోహబుద్ధి ఉన్నవాడికి భక్తి రుచికూడా తెలియదు.

ద్రోహబుద్ధి ఉన్నవాడు దురాత్ముడౌతాడు గాని మహాత్ముడు కాజాలడు. ద్రోహికి దైవసాక్షాత్కారము సిద్ధించదు.

## 26. నాతిమానితా :

అంటే తనను ఇతరులు గౌరవించాలనే భావన లేకుండుట.

"దేహము నేను" అను తలంపే అన్ని తలంపులకు మొదటి తలంపు. ప్రథమ తలంపు, ప్రధాన తలంపు, పునాది తలంపు. ఈ మొదటి తలంపునే అహంకారము అంటారు. అహంకారమునకు ఇతరులు ఉన్నారు గానీ

srimannagaru.com

- ఆత్మకు ఇతరులు లేరు. ఇతరుల పొగడ్తలను ఆశించుట అహంకార లక్షణము. ఇతరులు తనను పూజించవలెనను తలంపు కలిగి వుంటే అహంకారము పెరుగుతుంది. దోషములు పెరిగిన కొలది అహంకారము చిక్కబడుతుంది.

కీర్తి కాంక్షను తొలగించుకోలేకపోతే జ్ఞానోదయము కాదు. కీర్తిగాని, అపకీర్తిగాని జ్ఞాని యొక్క హృదయమును తాకవు. గౌరవము పొందాలని అనుకోనుట ఒక మానసిక వికారము. కాలక్రమములో ఆ వికారమే ఆవేశముగా మారుతుంది - అనర్థాలకు దారి తీస్తుంది. నిర్వికారస్థితిని పొందితేనేగాని ఈ ఆవేశము నుంచి విడుదల పొందలేము.

కామక్రోధములులాగే కీర్తిని సంపాదించాలనే తపన కూడా ఆత్మజ్ఞాన సముపార్జనకు అవరోధము. ఉన్నది ఒక్కటే వస్తువు. దానిని గ్రహించిన బుద్ధిమంతుడు పూజింపబడాలనే తలంపునుండి శాశ్వతముగా విడుదల పొందుతాడు. వ్యక్తులను కాకుండా పరమార్థమును చూసే వాడికి కీర్తికాంక్ష నశిస్తుంది. దైవమునందు, శాస్త్రమునందు, సద్గురువునందు సజీవమైన విశ్వాసముంటే గౌరవింపబడాలనే బలహీనత నుండి బయట పడవచ్చును.

srimmagaru.com

"భవన్తి సంపదం దైవీ మభిజాతస్య భారత" ఓ అర్జునా? నీవు ఈ దైవీ సంపదకు అర్హత కలిగి పుట్టావు. కనుక నీవు తప్పక తరించి తీరతావు - నీవు విచార పడకు" - అని పరమాత్మ వాసుదేవుడు అర్జునుడికి దైవీగుణములను వివరించాడు.

srimmagaru.com

# ముగింపు మాట

భగవంతుడు వాసుదేవస్వామి దైవీ సంపదను గూర్చి ముచ్చటగా మూడు శ్లోకాలలో వివరించాడు. దైవీ సంపద గలవాడికి భగవంతుని అవసరము లేకపోతే - మరి ఎవరికి కావాలి?

దైవీ సంపద మానవుణ్ణి అజ్ఞానము నుండి విడుదల చేస్తుంది. ప్రకృతి గుణములనే త్రాళ్ళచేత బంధించబడిన సామాన్య మానవుడు దైవీ సంపదను సంపాదించుకొని విడుదల పొందవచ్చును. రత్నాకరు డనే దోపిడీ దొంగ దైవీ సంపదను ఆర్జించుకొని వాల్మీకి మహర్షిగా పరిణామము చెందినాడు. విభీషణుడు అసుర కుటుంబములో జన్మించినప్పటికీ అతనిలో నున్న దైవీ గుణముల సహాయముతో శ్రీరామచంద్ర మూర్తిని ఆశ్రయించి దేవతగా పరిణామము చెందినాడు. దైవీసంపద లేనివాడికి శరణాగతి అసాధ్యము. శరణాగతిలేనివాడు శాంతిని పొందలేడు, కాంతిని చూడలేడు.

భగవంతుడు ఆత్మ రూపములో అందరి హృద యములలోను ప్రకాశిస్తున్నాడు. అంతటా వ్యాపించి యున్నాడు. అట్టి దైవమును సమదృష్టి లేకుండా సాక్షాత్క

srinannagaru.com

రించుకొనుట సాధ్యముకాదు. సమదృష్టి సహజ యోగము. ఎవరు ఏ యోగములో ప్రయాణము చేసినా; ఎవరు ఏ మత సిద్ధాంతము ప్రకారము అనుష్ఠానములు చేసినా, ఎవరు ఏ కులమునకు, ఏ జాతికి, ఏ దేశమునకు చెందిన వారైనప్పటికీ - దైవీ సంపదలేని వారు సత్య సాక్షాత్కారము పొందుట సాధ్యముకాదు.

మనస్సు వాక్కు, కాయము - వీటిని త్రికరణము అని అంటారు. వీటిలో మనస్సు అత్యంత ముఖ్యమైనది. మనస్సు విశాలమగుటకు, దానిలోతు పెరుగుటకు దైవీ సంపద సహకరిస్తుంది. మెదడులేని మనుష్యులు దైవీ సంపదను గౌరవించలేరు. కాముకుడు, అహంకారి దైవమును దర్శించలేరు. దైవీ గుణములు గలవాడు మాత్రమే - కామము యొక్క వల నుండి, అహంకారము యొక్క బంధము నుండి బయట పడగలడు. దైవీ సంపద గలవారు కాలక్రమములో దేవతలు అవుతారు. భగవంతుడు చెప్పినట్లుగా నడుచుకునే వారు దేవతలు - భగవంతుడు చెప్పిన మాటలను తిరస్కరించి ప్రవర్తించువారు రాక్షసులు.

దైవీ గుణములు గలవాడికి ప్రతిఫలము పట్ల ఆశగాని, ప్రతీకారము తీర్చుకోవాలనే తలంపుగాని ఉండనే ఉండదు. దైవీ సంపద గలవాని హృదయము

srinannagaru.com

నుండి శాంతి, అతని చూపుల నుండి వెన్నెల పరిసరములకు ప్రసరిస్తుంది. చేపకు బురద అంటనట్లు - దైవీ సంపద గలవాడు ద్వేషించేవారి మధ్యన ఉన్నప్పటికీ - ఆ ద్వేషము అతనిని తాకదు. దైవీ సంపద గలవారు మాత్రమే ఈ లోకములో ఆత్మ సామ్రాజ్యమును స్థాపించుటకు సహాయ సహకారములు అందిస్తారు. దైవీ సంపద గలవారు ఏ దేశములో నున్నా, ఏ మతములో నున్నా, ఏ కులములో నున్నా వారు పూజార్హులే!

కోరికలు దుఃఖమునకు కారణము. దైవీ సంపద మానవుణ్ణి కోరికలు లేని స్థితికి తీసుకొని వెళుతుంది. కోరికలకు, దైవమునకు ఒకచోట నివాసము పొసగదు. కోరికలను ధ్యానించేవాడు దైవమును పొందలేడు. సుగుణరాశిని దైవీ సంపద అని అంటారు. సుగుణముల వలన కోరికలు వలుచబడతాయి.

సమాజ కళ్యాణము కోసము పనిచేయుట కష్టమే! కాని సుగుణములు గలవాడు మాత్రము మంచిని ఇష్టముతోటి చేస్తుంటాడు. అతని మనస్సు ప్రశాంతము - అతని వాక్కు ప్రశాంతము - అతని పని ప్రశాంతము.

రూపము కంటే గుణమునకు, గుణము కంటే జ్ఞానమునకు ఆకర్షణ ఎక్కువగా ఉంటుంది. జ్ఞానము

srinannagaru.com

నకు మించిన శక్తిగాని, మహిమగాని ఈ లోకములో లేనేలేదు. మహిమల వలన ఇంద్రియ నిగ్రహముగాని, మనో జయముగాని సాధ్యముకాదు - సుగుణముల వలన మనోనిగ్రహము సాధించబడుతుంది. మహిమల వలన వచ్చే మూర్ఛ కేవలము తాత్కాలికము మాత్రమే - అది నిలబడదు.

సుగుణములు వివేకమును పెంచితే - దుర్గుణములు అవివేకమును పెంచుతాయి. ధనము, కీర్తి - ఇవి లౌకిక పదవులను తీసుకొని రావచ్చును. కాని సుగుణములు ఆత్మ పదవిని, ఆనంద పదవిని సాధించి పెడతాయి. సుగుణ సంపద గలవాడికి మాత్రమే సహన శక్తి అభివృద్ధి అవుతుంది. సుగుణములే నిజమైన ఐశ్వర్యము. ఆ ఐశ్వర్యము తరగదు, కరగదు. సుగుణములు మాత్రమే బుద్ధిని శుద్ధిచేయగలవు. గుణవంతుడు మాత్రమే దైవానుగ్రహమునకు పాత్రుడౌతాడు. దైవానుగ్రహము పొందినవాడికి అసాధ్యమంటూ ఏదీ లేదు. సుగుణ సంపదను అభివృద్ధి చేసుకొన్నవాడు ఆ ఎత్తులో నుండి క్రిందకు దిగడు.

దైవీ సంపద వలన రమణుడు మహర్షి అయినాడు. రామకృష్ణుడు పరమహంస అయినాడు, గాంధీ మహాత్ముడు అయినాడు. తిలక్ లోకమాన్యుడు అయి

srinannagaru.com

నాడు. సుగుణములు ఉన్నవారు మహాత్ములౌతారు - దుర్గుణములున్నవారు దురాత్ములౌతారు. గుణము లేని వాడికి జ్ఞానము రాదు. జ్ఞానము లేకపోతే జీవితగమ్యమైన మోక్ష సుఖమును పొందలేడు. సుగుణముల వలన మాత్రమే మనస్సు బంగారమౌతుంది. సాహసము లేకపోతే సుగుణ సముపార్జన సాధ్యము కాదు. సుగుణరాశి వలన వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

ఉన్నది ఆత్మ ఒక్కటే! మనకు కనిపించేది - మాయ, ప్రకృతి, అవిద్య! ఈ మాయను, ఈ ప్రకృతిని, ఈ అవిద్యను దాటుటకు సుగుణుల సహాయము అత్యంత అవసరము. పూజ చేయుటకు పుష్పాలు, జపము చేయుటకు జపమాల అవసరము. కానీ, బాహ్యపరికరములతో నిమిత్తము లేకుండానే సుగుణములను సంపాదించవచ్చును. సుగుణములు లేని వాడికి సుగుణముల విలువ తెలియదు. కనుక వాటిని సంపాదించుటకు ప్రయత్నము చేయడు. సహృదయములేనివాడు గీతను లోతుగా అధ్యయనము చేయలేడు. గుణవంతులే భవిష్యత్తులో ఉజ్వలముగా ప్రకాశించగలరు. గుణవంతులే శాంతికి, సుఖమునకు వారసులు. దైవ సంపదకు మించిన సంపద లేదు - ఆత్మ

srinannagaru.com

లాభమునకు మించిన లాభము లేదు. కనుక అన్ని విధములా శ్రమపడి పనిచేసి సుగుణములను అభివృద్ధి చేసుకోవలెను.

శాంతిని పొందుటకు గీతలో అనేక మార్గములను భగవంతుడు సూచించాడు. భక్తి వీధిలో ప్రయాణము చేసినా, జ్ఞాన వీధిలో ప్రయాణము చేసినా - ఆత్మానుభవమునే గమ్యముగా పెట్టుకోవాలి. దైవ సంపద ఆత్మ జ్ఞానము కానప్పటికీ "ఆత్మజ్ఞానానుభవము" అను గమ్యము దగ్గరకు తీసుకువెళ్ళి విడిచిపెడుతుంది. ఆత్మజ్ఞాని అశరీరుడు. అశరీరునకు అదృష్టమేమిటి - దురదృష్టమేమిటి? ఇష్టమేమిటి - అయిష్టమేమిటి?

భారతీయ సంస్కృతికి భగవద్గీత హృదయము. ఎందరో కళాకారులకు, రచయితలకు, వక్తలకు, రాజకీయవేత్తలకు, న్యాయవేత్తలకు, శాస్త్రవేత్తలకు, తత్వవేత్తలకు భగవద్గీత స్ఫూర్తిని, ఉత్తేజమును కలిగిస్తుంది.

తీరిక వేళలలో గీతను చదువుతూ గడుపుట మంచిది. గీతా పారాయణము మనస్సులో నున్న మాలిన్యమును తొలగిస్తుంది. గీత చెప్పిన సలహాలను, చేసిన హితోపదేశములను పాటించండి. గీతను ఉపదేశించిన వాసుదేవస్వామిని కృతజ్ఞతతో స్మరించండి. భగ

srinannagaru.com

వంతుడు మానవరూపము ధరించి మానవ జాతికి గీతా గ్రంథమును బహూకరించాడు. గీతా విద్యార్థులు సత్యాన్వేషకులుగా మాత్రమే కాకుండా సమాజ సేవకులుగా కూడా పేరుపొందాలి.

దైవీ సంపదను సంపాదించుకోండి. అది పరమాత్మతో సంగమమును చేకూర్చుతుంది. చౌకబారు ధనం కోసం, చౌకబారు పేరుకోసం ఆశపడి దైవీ సంపదకు దూరమగుట వివేకవంతమైన పనికాదు. దైవీ సంపద నిగ్రహమునిస్తుంది. మనస్సును పునీతము చేస్తుంది. జ్ఞానమును ప్రసాదిస్తుంది. దైవీ సంపదలేని వారి బ్రతుకులు భవిష్యత్తులో చితికిపోతాయి.

**గీతను చదవండి! చదివించండి! తరించండి!**

మరి శెలవు.

**ఓం తత్సత్**

srinannagaru.com




srinannagaru.com